ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



చిత్తూరు జిల్లా వార్తలు

బుధవారం 18 జూన్ 2025



బాధితురాలి వివరాలు తెలుసుకుంటున్న ఐసీడీఎస్ సీడీపీవో చంద్రకళ తదితరులు



ఆ ఊరి గుండె కరగలేదు!

అప్పు వసూలు కోసం చెట్టుకు కట్టేసి వేధించినా ఇదేమని అడగలేదు

- కన్నీటి పర్యంతమైన బాధిత మహిళ శిరీష
- భర్త చేసిన అప్పులకు భార్యకు హింస
- కాయకష్టంతో ముగ్గురు పిల్లల ఆలనాపాలనా

కుప్పం, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): 'నా కొడుకు మాయమ్మను కొట్టొద్దండా, కట్టేయేద్దండా అని చెబ్తేకూడా పక్కకు ఈడ్చేసినారు. చూసీచూడనట్లు ఎల్లిపోయినారు రెండొందల మంది.అందులో ఒకాయన ఫంక్షనుకొచ్చినాయన వద్దండి, ఈ మాదిరగ చేయొద్దండి అంటే గూడా డబ్బులు కట్టేసి నువ్వు తాడు తీసి, తీసుకోని పోండ అన్నారు.'..... బాధిత మహిళ శిరీష గోడు ఇది. భర్త చేసిన అప్పులకు ఆమె వేధింపులకు గురైంది. అలాఇలా కాదు.. అప్పులిచ్చిన వాళ్లు చెట్టుకు కట్టేసి మరీ కొట్టారు. ఆ ఇంటి ఆడవాళ్లు దుర్భాషలాడారు. ఇంత జరిగినా ఆయమ్మ ధైర్యంగానే ఉంది. కడుపున పుట్టిన బిడ్డలకోసం ఇన్ని అవమానాలు, హింస భరించి కూడా తనకు న్యాయం చేయాలని ఎలుగెత్తి చాటుతోంది. ఆ మహిళ వేదన ముఖ్యమంత్రి చంద్రబాబు విన్నారు. వెంటనే స్పందించి, పోలీసు యంత్రాంగాన్ని అలెర్ట్ చేసి, నిందితులను అరెస్టు చేయించారు. ధైర్యంగా ఉండమంటూ వీడియో కాల్ ద్వారా శిరీషకు ధైర్యం చెప్పారు.

కుప్పం మండలం దాసేగానూరు పంచాయతీ నారాయణపురం గ్రామం శిరీషది. ఆమె భర్త తిమ్మరాయప్ప జేసీబీ డ్రైవర్‌గా పనిచేసేవాడు. వారికి మధు (12), దీక్షిత (10) అనే ఆడపిల్లలు, అభి (6) అనే మగ పిల్లవాడు ఉన్నారు. కుటుంబం గడవడానికి తిమ్మరాయప్ప ఊరంతా లక్షల్లో అప్పులు చేశాడు. తీర్చలేక ఆరు నెలల క్రితం భార్యా బిడ్డలను వదిలి పరారయ్యాడు. ముగ్గురు పిల్లలతో శిరీష ఊరిలోనే ఒంటరిగా మిగిలిపోయింది. పాతికేళ్ల ప్రాయంలో ఉన్న ఆయమ్మకు అప్పులు తీర్చమంటూ గ్రామస్తులనుంచి వేధింపులు ఎక్కువయ్యాయి. 'నా వడ్డీ తీర్చేదానికి నా దగ్గర పడుకో..' అంటూ లైంగిక వేధింపులు కూడా ఎదురయ్యాయి. భరించలేకపోయిన శిరీష, ముగ్గురు పిల్లలను



శిరీష, ఆమె పిల్లలను పరామర్శిస్తున్న పీఎస్ఎం తదితరులు

తీసుకుని పుట్టిల్లు అయిన రామకుప్పం మండలం కెంచన బల్ల గ్రామానికి చేరుకుంది. అక్కడ కన్నవాళ్ల దగ్గర పిల్లలను ఉంచి బెంగళూరులో కూలిపని చేసుకుని బతుకు ఈడుస్తోంది. అప్పుడప్పుడూ పుట్టింటికి వచ్చి పిల్లలను చూసి వెళ్లేది. ఈ క్రమంలో నారాయణపురం మండల పరిషత్తు ప్రాథమిక పాఠశాలలో 1వ తరగతి పూర్తి చేసిన కొడుకు అభికి టీసీ తీసుకోవడానికి సోమవారంనాడు ఆ గ్రామానికి శిరీష వెళ్లింది. ఆమె భర్తకు గతంలో రూ.80 వేలు అప్పు ఇచ్చిన మునికన్నప్ప, ఆయన కుటుంబ సభ్యులు ఆమెను ఈడ్చుకు వెళ్లి, నడిరోడ్డుపై చెట్టుకు మోకు తాడుతో కట్టేశారు. ఆ ఇంటి ఆడవాళ్లు, మగవాళ్లు అనే తేడా లేకుండా మునికన్నప్ప కుటుంబ సభ్యులు అందరూ దారుణంగా దుర్భాషలాడుతూ, ఆమెను హింసించారు. 'ఒక ఆడదాన్ని కొడతా ఉంటే ఊరుమొత్తం చూసుకోని ఏమీ తెలియనట్లు ఎల్లిపోయింది. ఇదేనా నాకు జరిగే న్యాయం?' అంటూ శిరీష వేసిన ప్రశ్నకు సమాధానం ఎవరూ చెప్పాలి? ఇంత దారుణమైన ఘటనలో కూడా ఒక సాంత్వన. అదేమిటంటే అదే నారాయణపురంలో జరిగిన ఒక ఫంక్షన్‌కు హాజరైన ఇతర ప్రాంతాలకు చెందిన ఎవరో పెద్ద మనిషి కలగ జేసుకుని ఆయమ్మను కొట్టవద్దని వారించడానికి ప్రయత్నించాడట. ఆయనకు కూడా పరాభవమే ఎదురైంది. మా గ్రామ వివాదంలో జోక్యం చేసుకోవడానికి నువ్వెవరు? అంటూ ఊరు నిలదీసింది. అయితే నువ్వు మా అప్పు తీర్చేయ్ అని ఎద్దేవా చేసింది. ఏమీ చేయలేని ఆ మానవత్వం కలిగిన మనిషి మౌనంగా ఉండిపోవడం తప్ప ఏమీ చేయలేకపోయాడు.

బిడ్డలకోసమే ఈ కష్టం

అమానుష దాడికి గురైన శిరీషకు ముగ్గురు బిడ్డలు. భర్త తిమ్మరాయప్ప అప్పులు చేసి వాటిని తీర్చలేక సంసారం కాడిని వదిలేసి ఊరు వొదిలి పరారయ్యాడు. ఎక్కడున్నాడో ఆచూకీ తెలియదు. ఇటుచూస్తే ముగ్గురు బిడ్డల బాధ్యత ఆమె ఒక్కదానిమీదే పడింది. పుట్టింటి వాళ్లు పక్క మండలంలో ఉన్నారు కానీ, వారి ఆర్థిక పరిస్థితీ అంతంతమాత్రమే. ఇటు భర్తతో కలిసి కాపురం చేసిన నారాయణపురంలో అప్పులు తీర్చమంటూ వెంటపడడమే కాక, కొందరు లైంగిక వేధింపులకు కూడా దిగుతున్నారు. ఏమీచేయలేని నిస్సహాయతలో శిరీష రామకుప్పం మండలంలోని పుట్టినూరు కెంచబల్లకు చేరింది. కన్నవారింట పిల్లలను భద్రంగా ఉంచింది. అయితే పోషణ చేయాలి కదా. అందుకే ఊరుకాని ఊరు బెంగళూరు చేరి కూలీనాలీ చేసుకుంటూ బతుకు బండిని ఈడుస్తోంది. ఏడవ తరగతి పెద్ద పాప మధు ప్రత్యేక ప్రతిభావంతురాలు. రెండో పాప దీక్షిత 4, మగబిడ్డ అభి 1వ తరగతి చదువుతున్నారు. మధుకు వచ్చే వికలాంగ పింఛను మీద కూడా అప్పులిచ్చిన వాళ్ల కన్ను పడింది. ఆ పింఛను డబ్బులు సైతం శిరీషకు చేరనివ్వకుండా చేస్తున్నారు. తట్టుకోలేకపోయింది ఆమె. ఏదైతే అది కానివ్వమని పిల్లవాడి టీసీ తీసుకోవడానికి నారాయణపురం చేరి, ఇలా దారుణమైన వేధింపులకు గురైంది.తన భర్త ఆయన తమ్ముడికోసం రూ.16 లక్షలు అప్పు చేసి ఇవ్వడంవల్లే అప్పులపాలయ్యామని శిరీష అంటోంది. ఇంత జరిగినా ఆమె ధైర్యంగానే ఉంది. కుప్పం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆమె, ఖంగుమంటూ మాట్లాడుతోంది. తనకు జరిగిన అన్యాయంగురించి ఎలుగెత్తిచాటుతోంది. న్యాయం చేయాలని పరామర్శకు వెళ్లినవారందరినీ అభ్యర్థిస్తోంది. తన బిడ్డల భవిష్యత్తుకోసం తపిస్తోంది.

శిరీషకు సీఎం పరామర్శ

- రూ.5 లక్షల ఆర్థిక సాయం ప్రకటన
- పిల్లల చదువుకు హామీ



శిరీషతో ఫోన్లో మాట్లాడుతున్న చంద్రబాబు

కుప్పం, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): అప్పు తీర్చలేదని చెట్టుకు కట్టేసి అమానుషంగా వ్యవహరించిన దారుణమైన ఘటనలో బాధితురాలు శిరీషను ముఖ్యమంత్రి చంద్రబాబు పరామర్శించారు. మంగళవారం సాయంత్రం ఫోన్‌లో మాట్లాడి ఘటన వివరాలు అడిగి తెలుసుకున్నారు. గతంలో ఎప్పుడైనా వారినుంచి వేధింపులు ఎదురయ్యాయా అని అడిగారు. పలు సందర్భాల్లో ఇబ్బందులు పెట్టారని బాధితురాలు అయనకు చెప్పారు. ఈ ఘటన వల్ల తాను, పిల్లలు భయపడుతున్నామని గోడు వెళ్లబోసుకున్నారు. ఇటువంటి ఘటన దురదృష్టకరమని, ఇలాంటి వాటిని సహించే ప్రసక్తే లేదని సీఎం ఆమెకు స్పష్టం చేశారు. మానవత్వం లేకుండా ప్రవర్తించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఇప్పటికే అధికారులకు ఆదేశాలు ఇచ్చామని చెప్పారు. పిల్లల చదువుల గురించి ఆరా తీసిన ఆయన వారిని బాగా చదివించాలని సూచించారు. ప్రభుత్వపరంగా అన్ని విధాలుగా అండగా ఉంటామని, ధైర్యంగా ఉండాలని భరోసా ఇచ్చారు. అప్పుల బాధ, ఆర్థిక ఇబ్బందులతో బిడ్డలను చదివించుకోవడానికి ఇబ్బంది పడుతున్న శిరీష పరిస్థితి తెలుసుకున్నారు. అప్పటికప్పుడు ఆమెకు రూ.5 లక్షల ఆర్థిక సాయం ప్రకటించారు. ముగ్గురు పిల్లల చదువుల బాధ్యత ప్రభుత్వమే తీసుకుంటుందని సీఎం హామీ ఇచ్చారు. తదనంతర పరిణామాలపై తనకు నివేదిక ఇవ్వాలని, బాధిత కుటుంబానికి అందుబాటులో ఉండి అవసరమైన సాయం అందేలా ఊడాలని అధికారులను ఆయన ఆదేశించారు. అలాగే శిరీషను జనసేన కుప్పం ఇన్‌చార్జి నరేష్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తులసీనాథ్, దళిత నేత దేవరాజ్ కలసి పరామర్శించారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి మండపల్లి రాంప్రసాద్ రెడ్డి చేత ఫోన్లో మాట్లాడించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం బాధితురాలికి అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు.

రాజకీయంతో సంబంధం లేదు

నారాయణపురంలో జరిగిన ఘటనకు, రాజకీయంతో ఏమాత్రం సంబంధంలేదని కుప్పం డీఎస్పీ పార్థసారథి ప్రకటించారు.ఇచ్చిన అప్పులు తీర్చలేదన్న కారణంతోనే శిరీషపై దాడి చేశారన్నారు.ఆమెను చెట్టుకు కట్టేసి దాడికి పాల్పడిన మునికన్నప్ప, వెంకటమ్మ, రాజా, జగదీశ్వరి అనే వ్యక్తులపై బీఎన్ఎస్ 341/323/324/506/34/307 ఐపీసీ సెక్షన్ల కింద హత్యాయత్నం కేసు నమోదు చేశామని తెలిపారు.



నిందితులు మునికన్నప్ప, వెంకటమ్మ, జగదీశ్వరి

నిందితులకు రిమాండ్

శిరీషను చెట్టుకు కట్టేసి దాడికి పాల్పడిన కేసులో నిందితులు మునికన్నప్ప, వెంకటమ్మ, రాజా, జగదీశ్వరిలను మంగళవారం రాత్రి కుప్పం కోర్టులో పోలీసులు హాజరుపరిచారు.వారికి జడ్జి రెండువారాల రిమాండు విధించారు.

టోకెన్ల కోసం తోపులాట



టోకెన్ల కోసం ఎదురుచూస్తున్న మామిడి రైతులు

గుడిపాల, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): గుడిపాల మండలంలోని ఫుడ్ అండ్ ఇన్స్ ఫ్యాక్టరీ వద్ద మంగళవారం టోకెన్ల కోసం మామిడి రైతులు తోపులాడుకున్నారు.రోజుకు 50నుంచి 80దాకా మాత్రమే టోకెన్లు ఇస్తుండగా వాటి కోసం వస్తున్న మామిడి రైతుల సంఖ్య రోజు రోజుకూ పెరగడంతో ఫ్యాక్టరీ యజమానులు రైతులకు ఎటూ చెప్పలేక గమ్మునుండిపోయారు. ఫ్యాక్టరీలో పల్ప్ తయారీలో సాంకేతిక లోపం వలన సకాలంలో మామిడి కాయలు అన్‌లోడ్ చేయక పోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చింది. మరోపక్క, టోకెన్ల కోసం వందలాదిమంది ఫ్యాక్టరీ వద్ద గుమికూడారు.టోకెన్లను జారీ చేయాలని ఫ్యాక్టరీ సిబ్బందిని పట్టుబట్టారు. ఫ్యాక్టరీ మేనేజర్ చంద్రశేఖర్,సూపర్‌వైజర్ రమేష్ సిబ్బందితో కలసి టోకెన్లు జారీ చేస్తుండగా రైతుల మధ్య తోపులాట జరిగింది.దీంతో డీఎస్పీ సాయినాథ్, ఎస్ఐ రామ్మోహన్ ఫ్యాక్టరీ వద్దకు చేరుకుని రైతులతో చర్చించి జూలై 5వ తేది వరకు సుమారు 1200 టోకెన్లను పంపిణీ చేయించారు. దీంతో రైతులు ఊపిరిపీల్చుకున్నారు. ఇదిలా ఉండగా సీకేపల్లె వద్ద ఉన్న తాజా మ్యాంగో ఫ్యాక్టరీలో కాయల అన్‌లోడింగుకు ఎమ్మెల్యే పేరును వైసీపీ వారు వాడుకుంటున్నారని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి హేమాద్రినాయుడు, మండల టీడీపీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు ఆరోపించారు. ఎమ్మెల్యే జగన్ రైతుల మనిషి అని, ఆయన ఎవరికీ సిఫార్సు చేసే వ్యక్తి కాదంటూ ఫ్యాక్టరీ యజమానులతో వాగ్వాదానికి దిగి నిజమైన రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

ఆందోళన వద్దు....ఆదుకుంటాం

- కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు కలెక్టరేట్, జూన్17(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని తోతాపురి మామిడి రైతులను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని, రైతులెవ్వరూ ఆందోళన చెందవద్దని కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. మంగళవారం సాయంత్రం టెలికాన్ఫరెన్స్ ద్వారా అధికారులతో ఆయన మాట్లాడుతూ వాతావరణ పరిస్థితులు, రైతులు తీసుకున్న జాగ్రత్తల వల్ల ఈసారి మామిడి దిగుబడి అమాంతం పెరిగిందన్నారు. యుక్రెయిన్ యుద్ధం వల్ల మ్యాంగో పల్ప్ ఎగుమతి చాలావరకు తగ్గిందని చెప్పారు. పొరుగురాష్ట్రాలైన తమిళనాడు, కర్ణాటకల్లో కృష్ణగిరి మార్కెట్ నుంచీ, మామిడి గుజ్జు పరిశ్రమలనుంచి పార్లే, కోకో కోలా, పెప్సీ వంటి కార్పొరేట్ కంపెనీలు ఎక్కువగా మ్యాంగో పల్ప్ కొనుగోలు చేశాయని గుర్తుచేశారు.ఈ కారణంగానే గత రెండు మామిడి సీజన్లలోనూ జిల్లాలో గుజ్జు నిల్వలు ఫ్యాక్టరీల వద్ద నిల్వవుండిపోయాయన్నారు. ఈ నేపథ్యంలో రైతులు నష్టపోకుండా మద్దతు ధరను సీఎం చంద్రబాబు ప్రకటించారన్నారు. ప్రాసెసింగ్ యూనిట్ రూ.8 చెల్లిస్తే, ప్రభుత్వం రూ.4 సబ్సిడీ రూపంలో అందిస్తుందన్నారు. రైతులెవ్వరూ నష్టపోకుండా చివరిపంట వరకు ప్రభుత్వం ఆదుకుంటుందని భరోసా కల్పించారు. తొందరపాటు లేకుండా రైతులు మామిడి పంట కోయవద్దని, పక్వానికి వచ్చినతర్వాతే కోయాలన్నారు. చివరి కేజీవరకు ప్రభుత్వం ప్రతి రైతుకు రూ.4 సబ్సిడీ ఇచ్చేందుకు సిద్ధంగా ఉందని వివరించారు.

కలకలం



తిరుపతి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి):మంచితనం, మర్యాద, క్రమశిక్షణ, నైతిక విలువలు అంటూ పదేపదే వల్లెవేసే తండ్రీ తనయులు చెవిరెడ్డి భాస్కర రెడ్డి, మోహిత్‌రెడ్డి లిక్కర్ స్కామ్ కేసులో నిందితులుగా మారడం రాజకీయవర్గాల్లో కలకలం రేపుతోంది. గతేడాది ఎన్నికల పోలింగ్ మరుసటి రోజు టీడీపీ అభ్యర్థి పులివర్తి నానీపై జరిగిన దాడి ఘటన చెవిరెడ్డి రాజకీయంలో కొత్త కోణాన్ని ఆవిష్కరించగా, ఇప్పుడు లిక్కర్ స్కామ్ కేసులో తండ్రీ తనయులిద్దరూ నిందితులుగా నమోదు కావడంతో అటు జిల్లాలోనూ, ఇటు సొంత నియోజకవర్గంలోనూ వైసీపీ శ్రేణుల నైతిక స్థైర్యం దెబ్బతింటోంది. శ్రీలంక రాజధాని కొలంబో వెళ్లడానికి మంగళవారం ఉదయం బెంగళూరు విమానాశ్రయం చేరుకున్న చెవిరెడ్డి భాస్కర రెడ్డిని ఇమిగ్రేషన్ అధికారులు అడ్డుకున్నారు. ఆయనపై ఏపీ పోలీసులు లుకౌట్ నోటీసులు జారీ చేసిన క్రమంలో ఎయిర్‌పోర్టు పోలీస్ స్టేషన్ పోలీసులకు అప్పగించారు. వీరి సమాచారంతో ఆయన్ను అదుపులోకి తీసుకోవడానికి ఏపీ నుంచి సిట్ అధికారులు బెంగళూరు బయల్దేరి వెళ్లారు. గతేడాది జూలై 27న స్నేహితుడి పెళ్లికని దుబాయ్ వెళ్లేందుకు యత్నించిన చెవిరెడ్డి కుమారుడు మోహిత్‌రెడ్డిని లుకౌట్ నోటీసుల కారణంగా ఇమిగ్రేషన్ అధికారులు బెంగళూరు ఎయిర్‌పోర్టులో అడ్డుకున్నారు. ఆపై తిరుపతి నుంచీ పోలీసు అధికారులు వెళ్లి ఆయన్ను తీసుకొచ్చి 41 సీఆర్‌పీసీ నోటీసు ఇచ్చి పంపించేసిన సంగతి తెలిసిందే. తాజాగా లిక్కర్ స్కామ్ కేసులో చెవిరెడ్డి ప్రమేయముందంటూ సిట్ అధికారులు ఆయనతో పాటు అతడి సన్నిహితుల కార్యకలాపాలను లోతుగా తవ్వి తీస్తున్నారు. అందులో భాగంగా తొలుత ఆయన వద్ద గతంలో గన్‌మెన్‌గా పనిచేసిన గిరిని, తర్వాత మదన్‌రెడ్డిని సిట్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. వారిని ప్రశ్నించడం ద్వారా రాబట్టిన సమాచారంతో చెవిరెడ్డి వద్ద గతంలో వ్యక్తిగత సహాయకుడిగా పనిచేసిన బాలాజీని కూడా అదుపులోకి తీసుకున్నారు. చెవిరెడ్డి ప్రమేయం లిక్కర్ స్కామ్‌లో ఉందని వారితో చెప్పించేందుకు వేధించారని, చిత్రహింసలు పెట్టారన్న ఆరోపణలు పక్కన పెడితే.. సిట్ వీరిని విచారించడం ద్వారానే కేసులో చెవిరెడ్డిని, ఆయన తనయుడిని 38, 39 నిందితులుగా చేర్చింది. తనను లిక్కర్ స్కామ్‌లో ఇరికించేందుకు తనవద్ద గతంలో పనిచేసిన వారిని వేధిస్తున్నారంటూ ఆరోపించిన చెవిరెడ్డి ఓ దశలో తనను త్వరలో అరెస్టు చేస్తారంటూ ప్రకటించారు. ఆయన ఏ ఉద్దేశంతో ఆ ప్రకటన చేసినప్పటికీ మంగళవారం బెంగళూరు ఎయిర్‌పోర్టులో సిట్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు.దీంతో ఉమ్మడి చిత్తూరు జిల్లావ్యాప్తంగా వైసీపీ వర్గాలతో పాటు చెవిరెడ్డి అనుచరవర్గం ఉక్కిరిబిక్కిరవుతోంది.

'తల్లికి వందనం' అందని వారికి ఊరట

వెదురుకుప్పం, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): సాంకేతిక కారణాల వల్ల తల్లికి వందనం పథకం నిధులు అందని వారికి ప్రభుత్వం ఊరట కల్పించింది. అనర్హుల జాబితాలో ఉన్నవారు సవరణ చేసుకోవడానికి అవసరమైన గ్రీవెన్స్ దరఖాస్తు ఫారాన్ని ప్రభుత్వం విడుదల చేసింది. ఈ ఫారం పూర్తిచేసి ఈనెల 20వ తేదీలోపు సంబంధిత సచివాలయాల్లో ఇవ్వాలి. పూర్తిస్థాయిలో పరిశీలించి జూలై 5వ తేదీన తల్లికి వందనం నగదును తల్లి ఖాతాలో జమ చేస్తారు.

'అన్నదాత సుఖీభవ' ఈకేవైసీకి ఆందోళన వద్దు

వెదురుకుప్పం, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం త్వరలో అన్నదాత సుఖీభవ పథకం కింద రైతులకు నిధులను విడుదల చేయడానికి రంగం సిద్ధం చేసింది. ఈ పథకంలో లబ్ధి పొందటానికి ఈకేవైసీ చేసుకోవడానికి గడువు ఇచ్చింది. అయితే అర్హులైన రైతులందరికీ ఆటోమేటిక్‌గా ఈకేవైసీ పూర్తయిందని, ఎవరూ రైతు సేవా కేంద్రాలకు రావాల్సిన అవసరం లేదని వ్యవసాయశాఖ ఉద్యోగులు మంగళవారం తెలిపారు. అందువల్ల రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.



రెడ్ నెక్కుడు వాలాబీ (ఎర్ర మెడ గల వాలాబీ)





జూపార్కులో ఇక మరింత సందడి

● ఆగస్టులో విదేశీ వన్యప్రాణుల రాక

ఎస్వీ జూపార్కుకు మరికొన్ని వన్యప్రాణులు రానున్నాయి. సందర్శకులకు కనువిందు చేయనున్నాయి. ముమ్మూర్తులా ఆస్ట్రేలియాలోని కంగారు జాతిని పోలి ఉండే రెండు రెడ్ నెక్డ్ వాలాబీ(ఎర్ర మెడ)లు, దక్షిణాఫ్రికాకు చెందిన రెండు మార్మోసెట్‌లు ఆగస్టులో వస్తాయని ఎస్వీ జూపార్కు క్యూరేటర్ సెల్వం తెలిపారు. ప్రస్తుతం ఈ అందాల వన్యప్రాణులు గుజరాత్ జూపార్క్‌లో ఉన్నాయి. వీటిని ఉంచేందుకు రూ.55లక్షల వ్యయంతో ప్రత్యేకంగా ఎన్‌క్లోజర్లు ఏర్పాటు చేస్తున్నామని క్యూరేటర్ చెప్పారు. ఇందుకోసం టెండర్లు పిలుస్తున్నామన్నారు. వైట్ టైగర్స్ సఫారి పూర్తి కావచ్చిందన్నారు. త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. కాగా ఇక్కడి జూపార్కులో ఇప్పటికే 33 ఎన్‌క్లోజర్లు ఉన్నాయి. ఇందులో సింహాలు, బెంగాల్ టైగర్లు, ఏనుగులు, చిరుతలు, జాగ్వార్లు, నీటి ఏనుగులు, పక్షులు, అడవి దున్నలు, జింకలు, దుప్పులు, మొసళ్లు ఉన్నాయి. తిరుమలకు వచ్చే భక్తులే కాకుండా ఎస్వీ జూపార్కు సందర్శకులు సంఖ్య పెరుగుతోందని సెల్వం వివరించారు.

- మంగళం, ఆంధ్రజ్యోతి

శ్రీవారి సర్వదర్శనానికి 12 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. మంగళవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్ 2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో 9 షెడ్లలో సర్వదర్శన భక్తులు నిండిపోయారు. క్యూలైన్ కృష్ణతేజ సర్కిల్ వరకు విస్తరించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్-1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

- ● ఆదివారం హుండీ ఆదాయం: రూ.4.43 కోట్లు
- ● సోమవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 84,681
- ● తలనీలాలు సమర్పించినవారు: 35,261





బోర్డు మీటింగులో పాల్గొన్న టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, సభ్యులు, ఈవో

సనాతన హిందూ ధర్మప్రచారం కోసం

ఏటా రూ.120 కోట్ల ఖర్చు

- ● చిత్తూరు జిల్లాలో 141 ఆలయాల నిర్మాణానికి ఆమోదం
- ● మాననీయ విలువలపై విద్యార్థులకు ప్రత్యేక కార్యక్రమాలు
- ● టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు వెల్లడి

తిరుమల, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): 'సనాతన హిందూ ధర్మప్రచారం కోసం టీటీడీ ఏటా హెచ్‌డీపీపీ ద్వారా రూ.120 కోట్లు ఖర్చు చేస్తోంది. ఈ క్రమంలో వివిధ రకాల నూతన కార్యక్రమాలను ప్రారంభించేందుకు మా బోర్డు తీర్మానాలు చేసింది' అని టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు తెలిపారు. తిరుమలలోని అన్నమయ్య భవనంలో మంగళవారం టీటీడీ బోర్డు అత్యవసర సమావేశం జరిగింది. ఈ సమావేశం అనంతరం హెచ్‌డీపీపీ విభాగంలోనూ బోర్డు సభ్యులు వివిధ అంశాలపై చర్చించారు. ఆ వివరాలను బోర్డు సభ్యులు నరేష్, పనబాక లక్ష్మి, జ్యోతుల నెహ్రూ, జానకీదేవి, శాంతారామ్, రామ్మూర్తి, సదాశివరావు, ఎక్స్‌అఫిషియో సభ్యుడు దివాకర్‌రెడ్డితో కలిసి బీఆర్ నాయుడు క్యాంపు కార్యాలయంలో మీడియాకు వెల్లడించారు. చిత్తూరు జిల్లాలో 141 నూతన ఆలయాల నిర్మాణానికి ఆర్థికసాయం కోసం ఆమోదం తెలిపామన్నారు. మిగిలిన ప్రాంతాలకు చెందిన వారూ ముందుకు వస్తే రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు ఆలయ నిర్మాణాలకు శ్రీవాణి ట్రస్టు ద్వారా నిధులు కేటాయిస్తామన్నారు. దళితవాడల్లో ఆలయాల నిర్మాణానికి అధిక ప్రాధాన్యమిస్తామని చెప్పారు.

మరికొన్ని నిర్ణయాలు

- ● ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు చెందిన వారిని సమరసతా సేవా ఫౌండేషన్ ద్వారా తిరుపతిలోని టీటీడీ శ్వేతాకు తీసుకొచ్చి అర్చకత్వంపై శిక్షణ ఇవ్వాలని తీర్మానం. వారి ప్రాంతాల్లోని ఆలయాల్లో అర్చకత్వం చేసుకునేలా పూజా విధానాలు, వ్రతాలపై శిక్షణ ఇచ్చేందుకు నిర్ణయం.
- ● టీటీడీకి చెందిన ఏడు పాఠశాలల్లోని దాదాపు 1,600 మంది విద్యార్థులకు డే స్కాలర్ విధానంలో హైందవ సనాతన ధర్మం నేర్పిన మానవీయ విలువలు, వ్యక్తిత్వ వికాస కార్యక్రమాల్లో శిక్షణ ఇవ్వడానికి 'సద్గమయ' నిర్వహించేందుకు నిర్ణయం.
- ● సనాతన ధర్మం, తెలుగు సాంస్కృతిక వైభవంలో శిక్షణ ఇవ్వడానికి 'మన వారసత్వం' కార్యక్రమాన్ని ప్రారంభించాలని నిర్ణయం.
- ● వరలక్ష్మీ వ్రతం రోజు పద్మావతి అమ్మవారి ఆలయంలో 'సౌభాగ్యం' నిర్వహించేందుకు ఆమోదం.
- ● సీఎం ఆదేశాలతో టీటీడీ ఏడీ బిల్డింగ్‌లో 21న యోగా డే నిర్వహించాలని తీర్మానం.
- ● ప్రకృతి పరిరక్షణకు భక్తులకు మొక్కలను అందజేసేలా 'వన-నిధి', భవిష్యత్తు తరాలకు హరికథ కళను అందించేలా 'హరికథావైభవం', యువత ద్వారా భజనలను ప్రోత్సహించేలా 'భజేశ్రీనివాసం', గిరిజన ప్రాంతాల్లో శ్రీనివాస కల్యాణాలు, ధార్మిక కార్యక్రమాలు నిర్వహించేందుకు 'గిరిజనార్థనం'తో పాటు అక్షరగోవిందం, భగవద్గీత అనుష్ఠాన బోధన వంటి కార్యక్రమాలను నిర్వహించాలని నిర్ణయం.
- ● న్యూఢిల్లీలో 1952లో ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన టీటీడీ కళాశాలను ఆధునికీకరించేందుకు ఆమోదం.
- ● అలిపిరి చెక్‌పాయింట్‌లోని ఆర్చిని ఆధ్యాత్మిక శోభతో కొత్తగా నిర్మించాలని తీర్మానం.

'ఎన్ఐసీ' పోటీ పరీక్షలు రద్దు

● మనస్తాపానికి గురై యువకుడి ఆత్మహత్య



మాధుర్ (ఫైల్ ఫొటో)

పుత్తూరు/పుత్తూరు అర్బన్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): నేషనల్ ఇన్‌ఫార్మాటిక్స్ సెంటర్(ఎన్ఐసీ.. నిక్) సి- కేడర్ సైంటిస్ట్ పోస్టుల పోటీ పరీక్షను రద్దు చేయడంతో మనస్తాపానికి గురై పుత్తూరు పట్టణానికి చెందిన మాధుర్ (32) ఆత్మహత్య చేసుకున్నారు. నవీ ముంబైలోని ఎస్బీఐలో ఐటీ అధికారిగా పని చేస్తున్న ఈయన శనివారం ఉరేసుకున్నారు. అక్కడ పోలీసులు కేసు నమోదు చేయగా, పోస్టుమార్టం అనంతరం మంగళవారం మృతదేహాన్ని పుత్తూరుకు తీసుకొచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. 'తాను కలగన్న ఉద్యోగం దూరమైందని జీర్ణించుకోలేక ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మా కొడుకుకు ఎదురైన ఇబ్బందులు మరొకరికి జరగకూడదు. ఎన్ఐసీ నోటిఫికేషన్ రద్దుపై పూర్తి స్థాయిలో జాతీయ దర్యాప్తు సంస్థ ద్వారా విచారణ జరిపించాలి' అని రోదిస్తూ జార్జ్, హేమలత దంపతులు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం కూడా చొరవ తీసుకుని యువతకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు. వయస్సు రీత్యా ఎన్ఐసీలో ఉద్యోగానికి చివరి అవకాశం కావడంతో ఎంతగానో తపన పడి చదివాడని అతడి చెల్లెలు హాసిక చెప్పారు.

సూసైడ్ నోట్‌లో ఏముందంటే..!

'నేను ఎంతో కష్టపడి, ఇష్టపడి నిక్ పోటీ పరీక్షలు రాశా. ఇంటర్వ్యూలో నెగ్గి 5వ ర్యాంకు సాధించా. అపాయింట్‌మెంట్ లెటర్ ఇవ్వాల్సిన నేపథ్యంలో ఏడాదిగా వాయిదా వేస్తూ చివరకు రద్దు చేయడం జీర్ణించుకోలేకపోయా. ఆలస్యంపై ప్రధాని, నిక్ కార్యాలయాలకు ఫిర్యాదు చేశా. చివరకు నాతో పాటూ ఎంపికైన అభ్యర్థులతో బాంబే హైకోర్టును ఆశ్రయించా. ఇలాంటి తరుణంలో ఆశావహుల ఆశల మీద నీళ్లు చల్లుతూ పరీక్షల నోటిఫికేషన్ మొత్తాన్ని నిక్ రద్దు చేసింది. దీంతో మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకుంటున్నా. ఫైపెచ్చు నాలాంటి యువకులకు న్యాయం కలగాలి. వ్యవస్థలలో కనువిప్పు కలగాలి. నా మరణంతో వచ్చిన డబ్బుతో మంచి పాఠశాలను పెట్టి ఆధారం లేని చురుకైన పిల్లలకు ఉచిత విద్య అందించు హాసిక(చెల్లెలు)' అంటూ మాధుర్ సూసైడ్ నోట్‌లో రాశారు.

అబ్దుల్ కలాంలా సైంటిస్టు కావాలని..

'అబ్దుల్ కలాంలా బ్రహ్మచారిగా ఉంటూ సైంటిస్టు కావాలని కలలు కనేవాడు. నిత్యం పోటీ పరీక్షలు రాస్తూ ఉన్నత లక్ష్యాలను పెట్టుకున్నాడు.శనివారం రాత్రి 10 గంటల వరకు ఫోనులో మాట్లాడాడు. ఆ మరుసటి రోజు నుంచి ఫోన్ పని చేయలేదు. ఆదివారం ఉదయం పనికి రావద్దని శనివారమే పని మనిషికి చెప్పాడంట'అంటూ మాధుర్ తల్లి హేమలత రోదిస్తూ చెప్పారు. పట్టుదలతో ఎంటెక్ సాధించి జాతీయ బ్యాంకులు, బీఎస్ఎన్ఎల్ వంటి ప్రభుత్వ రంగసంస్థల్లో జనరల్ సీటుతో ఉద్యోగాలు సంపాదించాడని గుర్తుచేసుకున్నారు. ఆధ్యాత్మిక చింతన ఎక్కువేనన్నారు. తన కుమారుడి ప్రవర్తన చూసి ముంబైలోని ఎస్బీఐ డీజీఎం స్థాయి అధికారులు దగ్గరుండి శవ పేటికను భద్రంగా చెన్నైకు విమానంలో తరలించారని తెలిపారు.

మామిడి గుజ్జు పరిశ్రమ వద్ద

టోకెన్ పద్ధతి ప్రవేశపెట్టండి

● యాజమాన్యానికి కలెక్టర్ వెంకటేశ్వర్ సూచన

రేణిగుంట, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): మామిడి పండ్ల గుజ్జు తయారీ పరిశ్రమ వద్ద యజమానులు టోకెన్ పద్ధతిని ప్రవేశపెట్టాలని కలెక్టర్ వెంకటేశ్వర్ సూచించారు. రేణిగుంట మండలం ఎస్ఎస్ పురంలోని శ్రీ వర్ష ఫుడ్ పరిశ్రమలో మామిడి పండ్ల గుజ్జు తయారీని మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మామిడి కాయలను తీసుకొచ్చిన రైతులతో మాట్లాడారు. తోతాపూరి రకం మామిడి కాపు ముగిసే వరకు పల్ప్ ఫ్యాక్టరీలు కాయలను తీసుకుంటాయన్నారు. ప్రతి పరిశ్రమ వద్ద నియమించిన అధికారులు.. రైతులు తీసుకొచ్చే మామిడి కాయల టన్నులను నమోదు చేసుకుంటారన్నారు. ఈ మేరకు ప్రభుత్వం అందించే సబ్సిడీని ఆయా రైతుల ఖాతాల్లో నేరుగా జమ చేస్తామన్నారు. ఎప్పటికప్పుడు రైతులు తీసుకొచ్చే మామిడి కాయల వివరాలను కంప్యూటరీకరించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎంఐపీడీ సతీష్, మార్కెటింగ్ ఏడీ సురేంద్రబాబు, తహసీల్దారు సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు. అలాగే, కేవీబీపురంలోని దేవరాజు ఆగ్రోఫుడ్స్ ప్రైవేటు లిమిటెడ్‌ను కలెక్టర్ వెంకటేశ్వర్ తనిఖీ చేశారు.



మామిడి గుజ్జు ప్రైవేట్ పరిశ్రమ యాజమాన్యానికి సూచనలు చేస్తున్న కలెక్టర్

తోతాపురి కొనుగోలుకు సహకరించండి: జేసీ

పాకాల, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): పాకాల మండలం దామలచెరువు మ్యాంగోనగర్‌లో మంగళవారం జేసీ శుభం బన్సల్ పర్యటించారు. తోతాపురి మామిడికాయల కొనుగోళ్లను పరిశీలించారు. రైతులు, వ్యాపారులు, ర్యాంపుల యజమానులతో మాట్లాడారు.వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రైతుల నుంచి మామిడి కాయల కొనుగోలుకు సహకరించాలని సూచించారు. టన్నుకు ప్రభుత్వం రూ.4వేలు సబ్సిడీ ఇసున్న క్రమంలో గుజ్జు పరిశ్రమలు రూ.8వేలకు కొనుగోలు చేయాలన్నారు. ర్యాంపుల వద్ద టోకెన్ పద్ధతి ప్రవేశపెట్టి కొనాలని సూచించారు పరిశ్రమల్లో మామిడి కాయలు తీసుకోవడం లేదని, రవాణాకు తగినన్ని లారీలు లేవని ర్యాంపుల యజమానులు జేసీ దృష్టికి తీసుకొచ్చారు. తిరుపతి, అన్నమయ్య, నెల్లూరు జిల్లాల రవాణా సంఘాలతో చర్చించి ఏర్పాటు చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. పరిశ్రమలు, ర్యాంపుల వద్దకు తీసుకొచ్చిన కాయలను సకాలంలో అన్‌లోడింగ్ చేయకపోవడంతో చాలాభాగం పాడయిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎర్రావారిపాలెం,చిన్నగొట్టిగల్లులోని మామిడి కాయల మండీలు, ర్యాంపులను జేసీ పరిశీలించారు. జిల్లా ఉద్యాన శాఖ అధికారి దశరథరామిరెడ్డి, సీఐ సుదర్శన ప్రసాద్, మండల ఉద్యాన అధికారిణి శైలజ, డీటీ కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.



దామలచెరువులో వ్యాపారులు, ర్యాంపుల యజమానులు, రైతులతో మాట్లాడుతున్న జేసీ శుభం బన్సల్



రవి మృతదేహం వద్ద విలపిస్తున్న భార్య, బంధువులు

చెరువులో వాహనం బోల్తా

● ఒకరి మృతి, ముగ్గురికి గాయాలు

భాకరాపేట, జూన్ 17(ఆంధ్రజ్యోతి): చెరువులో టాటా సుమో బోల్తాపడిన సంఘటనలో ఒకరు మృతి చెందగా ముగ్గురు గాయపడ్డారు. ఎస్ఐ రాఘవేంద్ర కథనం మేరకు చిన్నగొట్టిగల్లు మండలం మారసానివారిపల్లె హరిజనవాడకు చెందిన శంకర, ప్రకాశ్, భాకరాపేటకు చెందిన రఘునాథ్, తిరుపతికి చెందిన రవి, శంకరలు టాటా సుమోలో మంగళవారం భాకరాపేట నుంచి చిన్నగొట్టిగల్లు బయలుదేరారు. చిన్నగొట్టిగల్లు చెరువు కట్టపై గంగమ్మ ఆలయం మలుపులో టాటా సుమో అదుపు తప్పింది. చెరువులోకి దూసుకెళ్లింది. వెనుక వస్తున్న ఓ ద్విచక్ర వాహనచోదకుడు వెంటనే స్థానికులు, పోలీసులకు సమాచారం అందించాడు. స్థానికులు, పోలీసులు క్రేన్ సాయంతో వారిని నీటి నుంచి కాపాడారు. అప్పటికే రవి(40) మృతి చెందాడు. మిగిలిన ముగ్గురికీ తీవ్ర గాయాలయ్యాయి. వీరిని రుయా ఆసుపత్రికి తరలించారు. రవి మృతదేహాన్ని పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఇతడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. ప్రమాదం విషయం తెలుసుకున్న అతని భార్య, బంధువులు చేరుకుని కన్నీరుమున్నీరయ్యారు.



గాయపడిన శంకర, రఘునాథ్, ప్రకాశ్



చెరువులో నుంచి క్షతగాత్రులను బయటకు తీస్తున్న స్థానికులు

207 మందికి టీడీఆర్ బాండ్ల పంపిణీ

తిరుపతి, జూన్ 17(ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ పరిధిలోని మాస్టర్ ప్లాన్ రోడ్లలో స్థలాలు కోల్పోయిన 207 మందికి టీడీఆర్ బాండ్లను పంపిణీ చేసినట్లు కమిషనర్ ఎన్.మౌర్య తెలిపారు. మాస్టర్ ప్లాన్ రోడ్లలో స్థలాలు కోల్పోయిన లబ్ధిదారులకు మంగళవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో కమిషనర్ టీడీఆర్ బాండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో మాస్టర్ ప్లాన్ రోడ్ల ఏర్పాటులో స్థలాలు కోల్పోయిన వారికి పారదర్శకంగా బాండ్లు పంపిణీ చేసేందుకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించామని చెప్పారు. అందరి దరఖాస్తులు పరిశీలించి ఆన్‌లైన్ చేశామని అన్నారు. పలు మార్లు టీడీఆర్ కమిటీ సభ్యులు ఆన్‌లైన్ ద్వారా సమావేశమై అన్ని పత్రాలు సక్రమంగా ఉన్న వారిని గుర్తించినట్లు తెలిపారు. ఈ ప్రక్రియలో ఇప్పటి వరకు 207మందికి టీడీఆర్ బాండ్లు పంపిణీ చేశామని అన్నారు. కాగా మంగళవారం ఆన్లైన్ ద్వారా నిర్వహించిన కమిటీ సమావేశంతో పాటు 187 మందిని ఎంపిక చేశామని చెప్పారు. వీరందరూ గిఫ్టిడీడ్ ఇచ్చిన వెంటనే టీడీఆర్ బాండ్లు మంజూరు చేస్తామని అన్నారు. ఈ సమావేశంలో డీసీపీ మహాపాత్ర తదితరులు పాల్గొన్నారు.

టీటీడీ రవాణాశాఖలో అప్రెంటీస్ కోసం

దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి(కలెక్టరేట్), జూన్ 17(ఆంధ్రజ్యోతి): టీటీడీ రవాణాశాఖలో సంవత్సర కాలం అప్రెంటిస్‌గా చేసేందుకు అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తిరుపతి ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ పి.గణేష్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐలో మోటార్ వెహికల్ మెకానిక్, ఎలక్ట్రీషియన్ పాసైన విద్యార్థులు ఇందుకు అర్హులన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తు, 10వ తరగతి మార్కుల జాబితా, ఐటీఐ సర్టిఫికెట్, ఆధార్‌కార్డు జిరాక్సు ప్రతులు, బ్యాంకు పాస్‌బుక్, మొబైల్ నెంబరు, ఈమెయిల్ ఐడీ, పాన్‌కార్డు, కుల ధ్రువీకరణపత్రం, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలను ఈ నెల 30వ తేదీ లోగా అప్రెంటిస్‌షిప్ అడ్వైజర్ సి.గంగాధరంకు సమర్పించాలన్నారు. మరిన్ని వివరాలకు 9441647174 ఫోన్ నెంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.

స్కూల్ బస్సులకు ఫిట్నెస్ తప్పనిసరి

● లేదంటే సీజ్ చేస్తామంటున్న రవాణా అధికారులు




ఫిట్నెస్ కోసం వచ్చిన వాహనాన్ని నడిపి చూస్తున్న డీటీవో మురళీమోహన్, పక్కన డీటీసీ కృష్ణవేణి, ఎంవీఐ శ్రీనివాసరావు

తిరుపతి(రవాణా), జూన్ 17(ఆంధ్రజ్యోతి): పాఠశాల, కళాశాలల బస్సుల ఫిట్నెస్‌పై రవాణాశాఖ అధికారులు ఫోకస్ పెట్టారు. ఫిట్నెస్ సర్టిఫికెట్ల కోసం హాజరయ్యే వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. మంగళవారం తిరుపతి ఆర్టీఏ కార్యాలయ పరిధిలో ఫిట్నెస్ సర్టిఫికెట్ కోసం వచ్చిన బస్సులను డీటీసీ కృష్ణవేణి, డీటీవో మురళీమోహన్ పరిశీలించారు. డీటీవో వాహనాన్ని నడిపి కండిషన్‌ను పరిశీలించారు. జిల్లాలో పాఠశాలలు, కళాశాలలకు సంబంధించి 1,700 బస్సులకుపైగా ఉండగా, ఇంకా 450కిపైగా ఎఫ్‌సీ (ఫిట్నెస్ సర్టిఫికెట్) తీసుకోలేదన్నారు. ఎఫ్‌సీల గడువు ముగిసిన వెంటనే బస్సులను యథావిధిగా కండిషన్‌లో పెట్టుకుంటేనే ఆ తర్వాత సర్టిఫికెట్లు జారీ చేస్తారన్నారు. ఫిట్నెస్‌తో పాటు ధ్రువపత్రాలు లేకుండా రోడ్లపై తిరిగే బస్సులకు జరిమానా విధించడంతో పాటు సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఇప్పటి వరకు ఫిట్నెస్ సర్టిఫికెట్లు పొందని బస్సులపై స్పెషల్‌డ్రైవ్ నిర్వహిస్తున్నామన్నారు. దీనికి ప్రత్యేకించి బృందాలను ఏర్పాటు చేశామన్నారు.

గురురాజుపల్లి ఎస్టీ కాలనీపై వైసీపీ నేత కన్ను!

● హైవే పక్కన ఇళ్ల స్థలాలను కొని ఖాళీ చేయించే పన్నాగం

రేణిగుంట, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): రేణిగుంట మండలం గురురాజుపల్లి ఎస్టీ కాలనీపై ఓ వైసీపీ నేత కన్ను పడింది. హైవే పక్కనున్న ఆ కాలనీలోని ఎస్టీల స్థలాలను కొని.. ఖాళీ చేయించే పన్నాగంలో ఉండటం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలిలా ఉన్నాయి. గురురాజుపల్లి పంచాయతీ పరిధిలోని ఎస్టీ కాలనీలో సుమారు 80 కుటుంబాలున్నాయి. ఈ ఎస్టీ కాలనీకి 20 ఏళ్ల కిందట శ్రీ సత్యసాయి ట్రస్ట్ తరఫున ఇళ్లు, రోడ్లు నిర్మించి ఇచ్చారు. ఇటీవల ఆరు లేన్ల నేషనల్ హైవే రావడంతో కాలనీలోని సగం ఇళ్లు రోడ్డుకు పోయాయి. మిగిలిన కాలనీలో ఎస్టీలు రోడ్డు నష్టపరిహారంతో ఇళ్లు నిర్మించుకొని హైవే పక్కన జీవనం సాగిస్తున్నారు. హైవే పక్కనే ఉండటంతో ఈ కాలనీలోని స్థలాలకు మార్కెట్‌లో రూ.కోట్లలో విలువ ఉంది. దీంతో ఆ స్థలాన్ని సొంతం చేసుకునేలా ఓ వైసీపీ నేత స్కెచ్ వేశారన్న ఆరోపణలున్నాయి. ఇప్పటికే మద్యం, డబ్బు ఎర చూపి 15 ఇళ్లను అతి తక్కువ ధరకు కొన్నారని సమాచారం. వీరందరినీ బలవంతంగా ఇటీవల ఖాళీ చేయించారన్న ఆరోపణలున్నాయి. దీంతో తమనూ బలవంతంగా ఖాళీ చేయిస్తారా అన్న ఆందోళన మిగిలిన ఎస్టీల్లో మొదలైంది. తమ కాలనీలో మిగిలిన ఇళ్లను ఆ వైసీపీ నేత బలవంతంగా కొనకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. కాగా, రోడ్డు విస్తీర్ణానికి నష్టపోయిన ఎస్టీ కుటుంబాలకు గురువరాజు పల్లి సమీపంలోని డీకేటీ భూముల్లో మూడు సెంట్ల లెక్కన కేటాయించనున్నారు. దీంతో ఆ భూములు బాధితులకు కేటాయించక ముందే ఎస్టీ కాలనీవాసులకు అడ్వాన్సుల రూపంలో డబ్బులు చెల్లించి వాటిని దక్కించుకోవాలని చూస్తున్నారని సమాచారం. వీటిపై అధికారులు విచారణ జరపాల్సి ఉంది.



నేషనల్ హైవేకి ఆనుకొని ఉన్న ఎస్టీ కాలనీ

చర్లపల్లి-నర్సపూర్, జాల్నా-తిరుపతి మార్గాల్లో 4 వారాంతపు ప్రత్యేక రైళ్లు మార్చి వరకు పొడిగింపు

హైదరాబాద్ సిటీ, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): చర్లపల్లి-నర్సపూర్, జాల్నా-తిరుపతి మార్గాల్లో నడుస్తున్న 4 వారాంతపు ప్రత్యేక రైళ్లను వచ్చే ఏడాది మార్చి నెలాఖరు దాకా పొడిగిస్తున్నట్లు దక్షిణ మధ్యరైల్వే ప్రకటించింది. చర్లపల్లి-నర్సపూర్ మార్గంలో నడిచే (07233/07234) ప్రత్యేకరైళ్లు మార్గమధ్యంలో నల్గొండ, మిర్యాలగూడ, నడికూడి, పిడుగురాళ్ల, సత్తెనపల్లి, గుంటూరు, విజయవాడ, గుడివాడ, కైకలూరు, ఆకివీడు, భీమవరం, వీరవాసరం, పాలకొల్లు స్టేషన్లలో ఆగుతాయి. అలాగే, జాల్నా- తిరుపతి మార్గంలో నడిచే (07609/07610) ప్రత్యేకరైళ్లకు మార్గమధ్యంలో పార్తూర్, సేలు, మాలావత్, పర్భానీ, గంగాకేర్, పర్లి, వైజనాథ్, లాతూర్, ఉద్గిర్, బీదర్, మార్పల్లి, వికారాబాద్, లింగంపల్లి, చర్లపల్లి, నల్గొండ, మిర్యాలగూడ, నడికూడి, సత్తెనపల్లి, గుంటూరు, తెనాలి, బాపట్ల, చీరాల, ఒంగోలు, కావలి, నెల్లూరు, గూడూరు, రేణిగుంట స్టేషన్లలో హాల్ట్ ఉంటుందని సీపీఆర్వో శ్రీధర్ తెలిపారు.

నేటినుంచి ఏటీఎస్ సేవలు ప్రారంభం

ఇకపై జిల్లాలోని వాహనాలకు ఒకేచోట ఎఫ్‌సీ ● బంగారుపాళ్యం మండలం నలగాంపల్లె సమీపంలో 'టెస్టింగ్ స్టేషన్' ఏర్పాటు

చిత్తూరు సిటీ, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్ (ఏటీఎస్) సేవలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. మొన్నటి వరకు రవాణా శాఖ కార్యాలయాల్లో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ (ఎంవీఐ)లు వాహనాలను పరిశీలించి ఎఫ్‌సీ (ఫిట్‌నెస్ సర్టిఫికెట్)లు ఇచ్చేవారు. ఇకపై కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో మన జిల్లాలోని బంగారుపాళ్యం మండలం నలగాంపల్లె సమీపంలో సర్వే నెంబర్లు 338, 339లో ఏటీఎస్ (ప్రైవేట్ ఏజెన్సీ)ను ఏర్పాటు చేశారు. గతంలో చిత్తూరు, పలమనేరు, పుంగనూరు, నగరి ప్రాంతాల్లోని రవాణాశాఖ కార్యాలయాల ద్వారా ఆయా ప్రాంతాల్లోని వాహనాలకు ఎఫ్‌సీలు చేసేవారు. ఇకపై జిల్లాలోని వాహనాలన్నీ ఎఫ్‌సీల కోసం నలగాంపల్లె సమీపంలోని ఏటీఎస్‌కు రావాల్సిందే. గతంలో వలెనే వాహనదారులు ఎఫ్‌సీల కోసం ఆన్‌లైన్‌లో చలానా కట్టి, స్లాట్ బుక్ చేసుకుని ఏటీఎస్‌కు వెళ్లాలి.



ప్రారంభానికి సిద్ధంగా ఉన్న ఏటీఎస్

వాహనదారులకు ఇబ్బందులు

ఎఫ్‌సీల కోసం గతంలో కుప్పం, నగరి, పుంగనూరు తదితర ప్రాంతాల వాహనదారులు తమకు సమీపంలోని రవాణాశాఖ కార్యాలయాల్లో ఎఫ్‌సీ తీసుకునేవారు. వీరంతా ఇప్పుడు 60 కిలోమీటర్లకుపైగా దూరం వచ్చి ఎఫ్‌సీ తీసుకోవాల్సి ఉంటుంది. అలాగే మార్గమధ్యంలోని టోల్‌గేట్ల వద్ద చార్జీలూ చెల్లించాల్సి రావడంతో కొన్ని ఇబ్బందులు తప్పేలా లేవు.

మామిడి గుజ్జు పరిశ్రమల పరిశీలన

తవణంపల్లె, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): తవణంపల్లె మండలంలోని ఫీల్ ఫ్రెష్ ఫుడ్ (మిట్టపల్లె), సిద్ధార్థ (కామాలూరు), జీసీఆర్ (గాజులపల్లె) గుజ్జు పరిశ్రమలతోపాటు గాజులపల్లె సమీపంలో ఉన్న రెండు ర్యాంపులను మంగళవారం ఇన్‌చార్జి కలెక్టర్ విద్యాధరి పరిశీలించారు. రైతులకు అందిస్తున్న మద్దతు ధర, తదితర అంశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పరిశ్రమల యజమానులతో మాట్లాడుతూ..రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రైతులకు అందించేలా చూడాలన్నారు. రైతులు కూడా పక్వానికి వచ్చిన కాయలను మాత్రమే ఫ్యాక్టరీలకు తరలించాలన్నారు. తవణంపల్లె తహసీల్దార్ సుధాకర్, మామిడి గుజ్జు పరిశ్రమల యజమానులు పాల్గొన్నారు.



కామాలూరులోని సిద్ధార్థ మామిడి గుజ్జు పరిశ్రమ యజమానులతో మాట్లాడుతున్న విద్యాధరి

ర్యాంపుల ద్వారా ఇతర రాష్ట్రాలకు మామిడి ఎగుమతులు

● ఇన్‌చార్జి కలెక్టర్ విద్యాధరి

చిత్తూరు సెంట్రల్, జూన్ 17(ఆంధ్రజ్యోతి): మామిడి అమ్మకాల్లో అధికార యంత్రాంగానికి రైతులు సహకరించాలని ఇన్‌చార్జి కలెక్టర్ విద్యాధరి విజ్ఞప్తి చేశారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ జిల్లాలో 35 మ్యాంగో ప్రాసెసింగ్ యూనిట్లుండగా, ప్రస్తుతం 27 పనిచేస్తున్నాయని, వీటిలో రోజువారీ 7 వేల మెట్రిక్ టన్నుల ప్రాసెసింగ్ జరుగుతుందన్నారు. 38 ర్యాంపుల్లో ఇప్పటి వరకు 30 ర్యాంపులు రిజిస్ట్రేషన్ చేసుకోగా, కొనుగోళ్లు జరుగుతున్నాయన్నారు.ఏ ఒక్క రైతుకూ అన్యాయం జరగకుండా, చివరి కాయ వరకు కొనుగోలు చేయించే బాధ్యత అధికార యంత్రాంగం తీసుకుందని స్పష్టం చేశారు. మామిడి రైతుల సందేహాలను నివృత్తి చేసేందుకు 08572-242777, 94910 77325 నంబర్లను హెల్ప్ లైన్ డెస్క్ ద్వారా అందుబాటులో ఉంచామన్నారు. ప్రభుత్వం తోతాపురికి రూ.12 మద్దతు ధర నిర్ణయించి సబ్సిడీ కింద రూ.4 ఇస్తోందని, ఫ్యాక్టరీలు రూ.8 ఇవ్వాల్సి ఉండగా, పరిస్థితులు సహకరించకపోవడంతో రూ.6 మాత్రమే ఇస్తున్నారన్నారు. గత ఎనిమిది రోజుల్లో 8,067 మంది రైతుల నుంచి 41,185 మెట్రిక్ టన్నుల మామిడికి సబ్సిడీ ధర వర్తింప చేశామని, వారానికి ఒక సారి రైతుల ఖాతాల్లో సబ్సిడీ మొత్తం జమవుతుందన్నారు. సబ్సిడీ అమలు ఆగస్టు నెలాఖరు వరకు ఉంటుందని, రైతులు ఆందోళన చెంది, పక్వానికి రాని కాయల్ని కోసి మండీలు, ర్యాంపుల్లో విక్రయాలు చేయడం ద్వారా ధర రూ.3.50కి పడిపోతుందన్నారు. ఈ విషయంలో రైతులు అధికార యంత్రాంగానికి సహకరిస్తే ర్యాంపుల్లో ధర స్థిరీకరణ చేస్తామన్నారు. మండీలు, ర్యాంపుల్లో కొనుగోలు చేసే మామిడిని నిర్వాహకులు తమిళనాడులోని కృష్ణగిరికి 40 టన్నులు, కర్ణాటకలోని శ్రీనివాసపురానికి 2.20 లక్షల టన్నులతో పాటు నాసిక్, షోలాపూర్ వంటి బయటి ప్రాంతాలకు వేల టన్నుల మామిడి ఎగుమతి జరుగుతోందన్నారు.ఉద్యానశాఖాధికారి మధుసూదన రెడ్డి, ఏడీ కోటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి కలెక్టర్ విద్యాధరి

వైసీపీ వైఫల్యాల వల్లే మామిడి రైతులకు కష్టాలు

● ఎమ్మెల్యే జగన్మోహన్

చిత్తూరు సిటీ, జూన్17 (ఆంధ్రజ్యోతి): వైసీపీ సర్కారు వైఫల్యాల వల్లే నేడు మామిడి రైతులు కష్టాలు పడుతున్నారని ఎమ్మెల్యే జగన్మోహన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 'మామిడి రైతులను ప్రభుత్వం పట్టించుకోలేదని, వ్యవసాయ శాఖ మంత్రి ఆదేశాలు అమలు కాలేదని ' వైసీపీ నేతలు చేస్తున్న ఆరోపణలు నిజంకాదన్నారు. గత వైసీపీ ప్రభుత్వం అక్రమాలకు పాల్పడడం వల్ల మామిడి గుజ్జు పరిశ్రమల ఎక్స్‌పోర్ట్ వ్యవహారాలను గాలికి వదిలేసిందని పేర్కొన్నారు. గతంలో మామిడి గుజ్జు ఎక్స్‌పోర్ట్ కాకపోవడం వల్ల గుజ్జు పరిశ్రమల వద్ద పల్ప్ నిల్వలు భారీగా పేరుకు పోయాయని తెలిపారు.సీఎం చంద్రబాబు మామిడి రైతులను ఆదుకోవడానికి మద్దతు ధర రూ.12గా ప్రకటించారన్నవిషయాన్ని వైసీపీ నేతలు గుర్తించాలన్నారు.

స్కూళ్లు, కాలేజీల బస్సులపై స్పెషల్ డ్రైవ్

25 కేసుల నమోదు - డీటీసీ నిరంజన్ రెడ్డి





డీటీసీ నిరంజన్ రెడ్డి - స్కూల్ బస్సును తనిఖీ చేస్తున్న ఎంవీఐలు రాజేశ్వరరావు, నరసింహులు తదితరులు

చిత్తూరు సిటీ, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): స్కూల్, కాలేజీ బస్సులపై స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు డీటీసీ నిరంజన్ రెడ్డి చెప్పారు. మంగళవారం తన కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. విద్యా సంవత్సరం ప్రారంభమైన నేపథ్యంలో పాఠశాల, కళాశాలల యాజమాన్యాలు తమ బస్సులను పక్కాగా సిద్ధం చేసుకుని ఎఫ్‌సీలు తీసుకున్నాకే రోడ్లపైకి తేవాలని చెప్పారు. జిల్లాలో పాఠశాల, కళాశాలలకు చెందిన సుమారు 845 బస్సులున్నాయని, ఇంతవరకు 800 బస్సులకు ఎఫ్‌సీలు చేసుకున్నారని తెలిపారు. మిగిలినవారు కూడా ఎఫ్‌సీ చేయించుకోవాలని అన్నారు. మంగళవారం నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌లో ఓవర్ లోడ్, ఎఫ్‌సీ, డ్రైవింగ్ లైసెన్సుల్లేని 25 బస్సులపై కేసులు నమోదు చేశామన్నారు.

తాజా ఫ్యాక్టరీలో తనిఖీలు

గుడిపాల, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): గుడిపాల మండలంలోని సీకేపల్లె వద్ద ఉన్న తాజా ఫ్యాక్టరీని మంగళవారం వ్యవసాయ శాఖ జేడీ మురళీకృష్ణ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అక్కడ పనిచేస్తున్న అధికారులతో ఆయన మాట్లాడుతూ.. రోజుకు ఎన్ని టన్నుల మామిడి కాయలు వస్తున్నాయని, ఎంత మంది రైతులు వస్తున్నారని అడిగారు. ప్రభుత్వం రైతులకు ఇస్తున్న సబ్సిడీ రూ.4 పక్కాగా నమోదు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు వ్యవసాయ అధికారి వేణుగోపాల్, ఎంపీడీవో శిరీష, కుమార్ తదితరులు పాల్గొన్నారు.



తాజా ఫ్యాక్టరీని తనిఖీ చేస్తున్న వ్యవసాయ శాఖ జేడీ మురళీకృష్ణ

హైరిస్క్ గర్భిణుల సంరక్షణపై శిక్షణ



సమావేశంలో ప్రసంగిస్తున్న డీఎంహెచ్‌వో సుధారాణి

చిత్తూరు రూరల్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): హైరిస్క్ గర్భిణుల సంరక్షణపై దృష్టి పెట్టాలని వైద్యాధికారులను డీఎంహెచ్‌వో సుధారాణి ఆదేశించారు. డీఎంహెచ్‌వో కార్యాలయంలో పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీ వైద్యాధికారులకు హైరిస్క్ గర్భిణుల సంరక్షణపై రెండ్రోజులపాటు శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈసందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ.. జిల్లాలో మాతా శిశు మరణాలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. డెలివరీ సమయంలో ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు నిత్యం పర్యవేక్షించాలన్నారు.

రేపు ప్రజా విచారణ

తిరుపతి(కలెక్టరేట్), జూన్ 17(ఆంధ్రజ్యోతి): జాతీయ మహిళా కమిషన్ సభ్యురాలు డాక్టర్ అర్చన మంజుందార్ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో ఈ నెల 19వ తేదీ గురువారం ప్రజావిచారణ కార్యక్రమం జరుగుతుందని కలెక్టర్ వెంకటేశ్వర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పెండింగ్‌లో ఉన్న మహిళల సమస్యలను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించడానికి గాను ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. తిరుపతి, సమీప జిల్లాల మహిళలు ఎవరైనా తమ సమస్యలను జాతీయ మహిళా కమిషన్ దృష్టికి ఫిర్యాదుల రూపంలో అందించవచ్చని కలెక్టర్ తెలిపారు.

కొవిడ్ కట్టడికి సిద్ధంగా ఉండండి

తిరుపతి(వైద్యం), జూన్ 17(ఆంధ్రజ్యోతి): కొవిడ్ కేసులు ఏ క్షణాన పెరిగినా వాటిని సమర్థవంతంగా ఎదుర్కొని కట్టడి చేసేదిశగా ప్రతీ ఒక్కరూ సిద్ధంగా ఉండాలని స్విమ్స్ డైరెక్టర్ ఆర్వీకుమార్ అన్నారు. స్విమ్స్‌లోని వైద్య విభాగాధిపతులు, అధికారులతో ఆయన మంగళవారం కొవిడ్‌పై సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ కొవిడ్ కేసులను దృష్టిలో పెట్టుకొని అవసరమైన వైద్య సామగ్రిని, పడకలను సిద్ధం చేసుకోవాలన్నారు. ప్రస్తుతం కొవిడ్ వార్డులో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఆరు పడకలతోపాటు అవసరం మేరకు పడకలను పెంచేందుకు తగు ఏర్పాట్లు చేయాలన్నారు. కొవిడ్ బాధితులకు అవసరమైన వైద్యసేవలను అందించేందుకు వైద్యులు, సిబ్బంది సిద్ధంగా ఉండాలన్నారు. కొవిడ్‌ను ఎలా కట్టడి చేయాలి, ముందస్తు ఏర్పాట్లు వంటి విషయాలపై ఆయన అధికారులతో సమీక్షించారు. కార్యక్రమంలో డీన్ అల్లాడి మోహన్, ఎంఎస్ రామ్, వైద్య విభాగాధిపతులు అలోక్ సమంత్రే, వెంకట్రమణ, భార్గవ్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో సమీక్షిస్తున్న డైరెక్టర్ ఆర్వీకుమార్

19మంది తహసీల్దార్లకు స్థానచలనం

తిరుపతి(కలెక్టరేట్), జూన్ 17(ఆంధ్రజ్యోతి): రెవెన్యూశాఖలో ప్రక్షాళనకు తిరుపతి కలెక్టర్ వెంకటేశ్వర్ శ్రీకారం చుట్టారు. 19 మంది తహసీల్దార్లు, 21 మంది డిప్యూటీ తహసీల్దార్లను మంగళవారం బదిలీ చేశారు. ఏళ్ల తరబడి తిష్టవేసి తిరుపతిలో ఉన్న కొంతమంది డీటీలను ఇతర మండలాలకు బదిలీ చేశారు.చాలా ఏళ్లుగా ఒకే ప్రాంతంలో పనిచేస్తున్న వారిని ఇతర ప్రాంతాలకు బదిలీ చేశారు. ప్రభుత్వాలు మారినా నేతలను అడ్డం పెట్టుకుని అదే ప్రాంతంలో పనిచేస్తున్న కొంతమంది అధికారులకు చుక్కెదురైంది. వారిని వేరే మండలాలకు బదిలీ చేశారు. ఇక, ఆర్ఐలు, వీఆర్వోల బదిలీలకు కసరత్తు జరుగుతోంది. బుధవారం వీరి బదిలీలు ప్రకటించే అవకాశం ఉంది. తిరుపతి అర్బన్ తహసీల్దారు కేపీ భాగ్యలక్ష్మిని చిన్నగొట్టిగల్లుకు.. అక్కడ పని చేస్తున్న కె.జనార్దనరాజును శ్రీకాళహస్తికి, జిల్లా సివిల్ సప్లైస్‌లో పనిచేస్తున్న రోశయ్యను కేవీబీపురానికి, కలెక్టరేట్ ఏవో భారతిని తొట్టంబేడుకు, అక్కడ పని చేస్తున్న మధుసూదన్‌రావును కలెక్టరేట్‌కు నియమించారు. కలెక్టరేట్ ఏవోగా రమేష్‌బాబు నియమితులయ్యారు. సత్యవేడు తహసీల్దారు టీవీ సుబ్రహ్మణ్యంను పిచ్చాటూరుకు, వరదయ్యపాళెంలోని రాజశేఖర్‌ను సత్యవేడుకు, శ్రీకాళహస్తి ఆర్డీవో కార్యాలయ ఏవో శ్రీదేవిని బుచ్చినాయుడుకండ్రిగకు రెగ్యులర్ చేశారు. శ్రీకాళహస్తిలోని లక్ష్మీనారాయణను కలెక్టరేట్‌కు కేటాయించారు. శాంతిని శ్రీకాళహస్తి ఆర్డీవో కార్యాలయ ఏవోగా నియమించారు. సూళ్లూరుపేటలోని నరసింహారావును వెంకటగిరికి, చిట్టమూరుకు సతీష్‌కుమార్‌ను, కలెక్టరేట్‌లో ఉన్న ద్వారకనాథరెడ్డిని బాలాయపల్లికి కేటాయించి డిప్యూటేషన్‌పై కలెక్టరేట్‌కు నియమించారు.

నిరసన కార్యక్రమాలకు అనుమతి తప్పనిసరి

● ఎస్పీ మణికంఠ

చిత్తూరు అర్బన్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): 'ప్రజా స్వామ్యంలో ప్రజలకు తమ అభిప్రాయాలను తెలియజేసే హక్కు ఉంటుంది. అయితే అలాంటి నిరసన కార్యక్రమాలను చేయడానికి డీఎస్పీ స్థాయి అధికారితో ముందస్తు అనుమతి తీసుకోవాలి' అని ఎస్పీ మణికంఠ సూచించారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. పెద్ద ఎత్తున సమూహాలు గుమికూడే కార్యక్రమాలు, ఊరేగింపులు, ఆందోళనలకు అనుమతి తప్పనిసరి. అనుమతి తీసుకోవడం వల్ల ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భద్రత ఏర్పాట్లు చేస్తారు. ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించినా సామాన్య ప్రజలకు ఇబ్బంది కల్గించేలా ఉండకూడదు. నిరసన కార్యక్రమాన్ని నిర్వహించాలనుకునే వ్యక్తులు లేదా సంస్థలు కనీసం వారం ముందు సంబంధిత పోలీసుస్టేషన్లలో లిఖిత పూర్వకంగా దరఖాస్తు చేసుకోవాలి. అందులో కార్యక్రమం తేదీ, సమయం, ప్రదేశం, పాల్గొనేవారి అంచనా సంఖ్య, మైక్ వాడకం వంటి వివరాలు ఉండాలి. పోలీసులు పరిస్థితిని సమీక్షించి అనుమతి ఇస్తారు. ఊరేగింపులు జరపాలనుకుంటే ముందుగానే మార్గాన్ని ఖరారు చేయాలి. ఆ మార్గంలో కీలకమైన ట్రాఫిక్ జంక్షన్లలో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా, అత్యవసర సేవలకు అంతరాయం కలగకుండా చూసుకోవాలి. ట్రాఫిక్ నియంత్రణ కోసం పోలీసులతో సమన్వయం చేసుకోవాలి. ఎలాంటి ఘర్షణలు, ఆందోళనలకు పాల్పడకూడదు. రాళ్ల దాడులు, ప్రభుత్వ ఆస్తుల ధ్వంసం, పోలీసులపై దాడుల్లాంటి చర్యలు చట్ట విరుద్ధం. కార్యక్రమమంతా శాంతియుతంగా ఉండాలని ఎస్పీ ఆ ప్రకటనలో వివరించారు.

ఆశాల సమ్మె నోటీసు



డీఎంహెచ్‌వోకు సమ్మె నోటీసు ఇస్తున్న ఆశా వర్కర్ల యూనియన్ నాయకులు

చిత్తూరు రూరల్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యల పరిష్కారం కోసం జూలై 9వ తేదీన సమ్మె చేయనున్నట్లు ఆశా వర్కర్లు తెలిపారు. ఈ మేరకు ఆశా వర్కర్ల యూనియన్ నాయకులు మంగళవారం డీఎంహెచ్‌వో సుధారాణికి ముందస్తు సమ్మె నోటీసు అందజేశారు. కనీస వేతనం అమలు చేయాలని, లేబర్ కోడ్‌లను తీసుకురావాలన్న కేంద్ర ప్రభుత్వ ప్రయత్నాన్ని మానుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సురేంద్రన్, ఆశా వర్కర్ల యూనియన్ నాయకులు గంగ పాల్గొన్నారు.

పంటలపై ఆగని గజదాడులు

కల్లూరు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలంలో పంటలపై గజదాడులు ఆగడం లేదు. మండలంలోని పాళెం పంచాయతీలో సోమవారం రాత్రి పంటలను ధ్వంసం చేయడంతో తీవ్ర నష్టం వాటిల్లింది. తూర్పు విభాగం అటవీ ప్రాంతంలోని సూరప్పచెరువు నుంచి బయలు దేరిన 14 ఏనుగుల గుంపు అటవీప్రాంతం సరిహద్దులోని మామిడి తోటల్లోకి ప్రవేశించాయి. ముందుగా కోటపల్లిలోని రైతు దామోదర్‌నాయుడుకు చెందిన 25 మామిడిచెట్లను ధ్వంసం చేశాయి. పశుగ్రాసాన్ని తొక్కేశాయి. అనంతరం రైతులు దామోదర్, భాస్కర్‌నాయుడు, నరేష్‌కు చెందిన మామిడిచెట్ల కొమ్మలను విరిచేశాయి. రైతు నరేష్ పొలంలోని విద్యుత్ స్తంభాన్ని ధ్వంసం చేశాయి. రైతు యుగంధర్‌కు చెందిన డ్రిప్ పైపులను ధ్వంసం చేశాయి. మామిడిచెట్లను విరిచేశాయి. అనంతరం ఏనుగుల గుంపు అడవిలోకి తిరుగుముఖం పట్టాయి. మార్గంలోని పలువురు రైతుల మామిడి చెట్ల కొమ్మలను విరుచుకుంటూ అడవిలోని చింతలవంక వద్దకు చేరుకున్నట్లు స్థానికులు తెలిపారు. ధ్వంసమైన పంటలను మంగళవారం ఉదయం అటవీశాఖ సిబ్బంది పరిశీలించారు.



పశుగ్రాసాన్ని తొక్కేసిన ఏనుగుల గుంపు

ఒక్క రోజే విధులు!

పాలసముద్రం, జూన్ 17(ఆంధ్రజ్యోతి):పాలసముద్రం ఎంపీడీవో కార్యాలయానికి సీనియర్ క్లర్కుగా తిరుపతి పీఆర్ ఆఫీస్ నుంచి ఎల్.కృష్ణ బదిలీపై సోమవారం వచ్చారు. ఒక్క రోజు విధులు నిర్వహించి తనకున్న పలుకుబడితో డిప్యుటేషన్‌పై తిరిగి తిరుపతికే వెళ్లి పోయారు. ఇక్కడ క్లర్కుగా పని చేసిన రాజేశ్వరి చిత్తూరు జడ్పీకి బదిలీపై వెళ్లారు.అసలే ఎంపీడీవో కార్యాలయంలో సిబ్బంది తక్కువగా వున్నారు.వచ్చిన సిబ్బంది ఇలా వెళ్లిపోతే పనులు జరిగేదెలా అని జనం చర్చించుకుంటున్నారు.

అంగన్వాడీ సిబ్బంది దురుసుగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు : సీడీపీవో

పాలసముద్రం, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): అంగన్వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులపై సిబ్బంది దురుసుగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తప్పవని గంగాధరనెల్లూరు సీడీపీవో పద్మసునంద, పాలసముద్రం ఎంపీడీవో సతీష్ హెచ్చరించారు. 'తండ్రిపై కోపంతో చిన్నారిని కొట్టిన అంగన్వాడీ టీచర్' అనే శీర్షికన మంగళవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంపై వారు స్పందించారు. ఘటన జరిగిన పాలసముద్రం మండలంలోని టీవీఎస్ఆర్‌పురం అంగన్వాడీ కేంద్రంలో విచారణ నిర్వహించారు. మరోవైపు కార్వేటినగరం సీఐ హనుమంతప్ప ఆదేశాలతో పాలసముద్రం పోలీసులు కూడా కేంద్రానికొచ్చి విచారించారు. అంగన్వాడీ టీచర్, ఆయా కోడలిపై లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయాలని చెప్పారు. గ్రామస్తులు చొరవ తీసుకుని విద్యార్థి తల్లిదండ్రులకు నచ్చజెప్పి, ఎలాంటి ఫిర్యాదు ఇవ్వకుండా చేశారు. కేంద్రాన్ని సక్రమంగా నిర్వహించాలని, ఇలాంటివి పునరావృతమైతే చర్యలు తప్పవని సిబ్బందిని హెచ్చరించి సీడీపీవో, ఎంపీడీవో అక్కడినుంచి వెళ్లిపోయారు. అంగన్వాడీ సూపర్‌వైజర్ జయశ్రీ, రెడ్డికల్యాణి, కార్యదర్శులు సత్యనారాయణ, జయశంకర్ పాల్గొన్నారు.



అంగన్వాడీ కేంద్రంలో విచారణ చేస్తున్న సీడీపీవో, ఎంపీడీవో

జీడీనెల్లూరులో ఫ్యాక్టరీ స్థాపనకు 'పాలీహోస్' రెడీ

రాష్ట్ర ప్రభుత్వ విప్ థామస్

వెదురుకుప్పం, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): గంగాధరనెల్లూరు నియోజకవర్గంలో ఫ్యాక్టరీని స్థాపించడానికి పాలీహోస్ అధినేత (మేనేజింగ్ డైరెక్టర్) హతీమ్ షబ్బీర్ సిద్ధమయ్యారని రాష్ట్ర ప్రభుత్వ విప్ డాక్టర్ వీఎం థామస్ మంగళవారం తెలిపారు. చెన్నైలో మంగళవారం షబ్బీర్‌ను థామస్ కలిశారు. ప్రపంచంలోనే అతిపెద్ద పాలీహోస్ ఫ్యాక్టరీని జీడీనెల్లూరులో స్థాపించడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని చెప్పారు. పాలీహోస్.. ఆధునిక తయారీ, సౌకర్యాలతో కూడిన వైవిధ్యభరితమైన పరిశ్రమ అని, అనుభవజ్ఞులైన సాంకేతిక నిపుణులచే నిర్వహించబడుతుందన్నారు. అధిక నాణ్యత, విశ్వసనీయ ఇంధన, రవాణా ఉత్పత్తుల రూపకల్పన, అభివృద్ధి తయారీ, పంపిణీపై దృష్టి సారిస్తోందన్నారు. ఇది ఉత్తర, దక్షిణ అమెరికా, యూరప్, మిడిల్ ఈస్ట్, ఆగ్నేసియా, దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియాలో ఉనికితో ప్రపంచవ్యాప్త ముద్ర వేసిందన్నారు. పాలీహోస్.. థామస్ ఆహ్వానాన్ని అంగీకరించి, త్వరలోనే జీడీనెల్లూరులో కొత్త ఆటో మొబైల్ ఫ్యాక్టరీ స్థాపనకు సాధ్యాసాధ్యాలను పరిశీలించనుందన్నారు. మొదటి దశలో జీడీనెల్లూరు నియోజకవర్గంలో 800 మందికి ఉపాధి కల్పించే లక్ష్యంతో ప్రణాళికలను సిద్ధం చేస్తోందని థామస్ వివరించారు.



హతీమ్ షబ్బీర్‌తో థామస్

బీసీఎన్ విద్యా సంస్థల విద్యార్థులకు రూ.16 కోట్ల గ్రూప్ ఇన్సూరెన్స్

కుప్పం, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): కుప్పంలోని బీసీఎన్ విద్యా సంస్థల్లోని విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున మొత్తం 1606 మంది విద్యార్థులకు రూ.16.06 కోట్ల విలువ కలిగిన గ్రూప్ ఇన్సూరెన్స్ పాలసీని యాజమాన్యం ప్రకటించింది. కుప్పం ఇంజనీరింగ్ కళాశాల వైస్ చైర్మన్ డాక్టర్ ఎన్.సునీల్ రాజ్ జన్మదిన వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీఎన్ విద్యా సంస్థల చైర్మన్, వైస్ చైర్మన్ సునీల్ రాజ్, సెక్రటరీ సాగర్ రాజ్ తెలిపారు. జన్మదినాన్ని పురస్కరించుకుని రామకుప్పం మండలం విజలాపురం సాంఘిక సంక్షేమ బాలికల వసతిగృహం, శాంతిపురం మండలం రాళ్లబూదుగూరులోని బాలికల వసతిగృహాల్లో ఆర్వోఆర్ ప్లాంట్లు ఏర్పాటు చేశారు. అలాగే రామకుప్పం గిరిజన బాలికల వసతి గృహానికి 30 కుర్చీలు అందించారు. గుడుపల్లె మండలం శెట్టిపల్లెలోని విక్టరీ బోర్డింగ్ స్కూల్ విద్యార్థులకు అన్నదానం చేశారు. కార్యక్రమాల్లో కుప్పం ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.సుధాకరబాబు, వైస్ ప్రిన్సిపాల్ ఎస్.భాస్కరన్, ఆర్ అండ్ డి డైరెక్టర్ జీఎస్.కోదండరామయ్య, లయన్స్ క్లబ్ జోనల్ చైర్మన్ మహేష్, ప్రభుత్వ వృత్తివిద్యా కళాశాల అధ్యాపకులు జగదీశ్‌బాబు, విభాగాధిపతులు, లయన్స్ క్లబ్ సభ్యులు, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు గ్రూప్ ఇన్సూరెన్స్ ప్రకటిస్తున్న బీసీఎన్, సునీల్ రాజ్ తదితరులు

పలమనేరు
కుప్పం/పుంగనూరు

మామిడి రైతులూ.. ఆందోళన వద్దు



మామిడి రైతులతో మాట్లాడుతున్న చల్లా రామచంద్రారెడ్డి

కల్లూరు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): గుజ్జు పరిశ్రమ యజమానులు, ర్యాంపు యజమానులు, వ్యాపారులు మామిడి రైతులకు ఇబ్బంది కలిగిస్తే సహించేది లేదని పుంగనూరు నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి తెలిపారు. పులిచెర్ల మండలం ఎంజేఆర్ ఇంజనీరింగ్ కళాశాల సమీపంలోని ర్యాంపు వద్ద నిబంధనల మేరకు తోతాపురి మామిడి కొనుగోలు చేయకపోవడంపై మామిడి రైతులు చల్లా రామచంద్రారెడ్డికి ఫిర్యాదు చేశారు. దీంతో ఆయన మంగళవారం ర్యాంపు వద్దకు చేరుకొని ర్యాంపు యజమాని, మామిడి రైతులతో మాట్లాడారు. మామిడి రైతుల కష్టాలను గుర్తించి వారిని ఆదుకునేందుకు సీఎం చంద్రబాబు మద్దతు ధరను ప్రకటించారన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన మామిడి మద్దతు ధరను వ్యాపారులు, గుజ్జు పరిశ్రమ యజమానులు రైతులకు తప్పక చెల్లించాలన్నారు. తోతాపురి మామిడి కిలోకు రూ.4 ప్రభుత్వం అందజేయడం జరుగుతుందన్నారు. తహసీల్దార్ జయసింహ, ఎంపీడీవో రాజశేఖర్, ఉద్యానశాఖ అధికారిణి సంతోషికుమారి, రాష్ట్ర కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ ఉయ్యాల రమణ, ఏఎంసీ చైర్మన్ శ్రీనివాసులునాయుడు, నాయకులు ధనంజయనాయుడు, మురళీధర్‌నాయుడు, సుబ్బారెడ్డి, నరేంద్రచౌదరి, మహేష్, వెంకట్రామనాయుడు, రమేష్, సురేష్, అనిల్, కరుణాకర్‌నాయుడు, నాగరాజనాయుడు, ఖాదర్‌వల్లి, సుబ్రహ్మణ్యంనాయుడు, రైతులు పాల్గొన్నారు.

టీడీపీ ప్రభుత్వంలోనే అభివృద్ధి

రొంపిచెర్ల, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): టీడీపీ ప్రభుత్వంలో అభివృద్ధి జరుగుతోందని పుంగనూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి అన్నారు. మంగళవారం నియోజవర్గం నుంచి వచ్చిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలతో ప్రత్యేకంగా పార్టీ కార్యాలయంలో పలుకరించి సమస్యలు తెలుసుకున్నారు. సోమల మండలంలోని అడుసుపల్లెలో మంచినీటి సౌకర్యం, మురుగునీటి కాలువలు నిర్మాణం చేపట్టాలని మణియాదవ్ కోరారు. అలాగే సోమల మార్కెట్‌యార్డు నిర్మాణ పనులు త్వరగా పూర్తిచేసి టమోటా, మామిడి రైతులకు మార్కెటింగ్ వసతి కల్పించాలని, డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని మండల పార్టీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యంనాయుడు, సోమల గ్రామ కమిటీ అధ్యక్షుడు శివశంకర్ విన్నవించారు. కార్యక్రమంలో నాయకులు వేణుగోపాల్‌నాయుడు, రమేష్‌నాయుడు, చౌడేపల్లి, సదుం టీడీపీ మండల పార్టీ అధ్యక్షులు రమేష్‌రెడ్డి, ప్రసాద్ రెడ్డి, రొంపిచెర్ల సర్పంచ్ ఆర్.ఇబ్రహీంఖాన్, రాష్ట్ర కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ ఉయ్యాల రమణ, చంగల్‌రెడ్డి, రామమూర్తి, రఘునాద్, నాగరాజ, శివకుమార్, ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.

పార్టీ పటిష్ఠతకు సమన్వయంతో పనిచేద్దాం

● మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు



సమావేశంలో మాట్లాడుతున్న గౌనివారి శ్రీనివాసులు

రామకుప్పం, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): పార్టీ పటిష్ఠతకు టీడీపీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు పిలుపునిచ్చారు. మంగళవారం రామకుప్పం టీడీపీ కార్యాలయంలో పార్టీ ముఖ్యనేతల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాచార లోపంతో కొన్ని సమస్యలు రావడం సహజమని.. వాటిని పట్టించుకోకుండా కలిసికట్టుగా ముందుకు సాగాలన్నారు. ప్రభుత్వం చేడుతున్న సంక్షేమ పథకాలను ఎప్పటికప్పుడు ప్రజలకు వివరించాలన్నారు. అలాగే అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందేలా కృషి చేయాలని సూచించారు. స్థానిక ఎన్నికలకు ఇప్పటి నుంచి సంసిద్ధం కావాలన్నారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, బీసీసెల్ కార్యనిర్వాహక కార్యదర్శి పత్ర నారాయణాచారి, పార్టీ మండలాధ్యక్షుడు ఆనందరెడ్డి, మాజీ అధ్యక్షుడు ఆంజనేయరెడ్డి, ఏఎంసీ మాజీ వైస్‌చైర్మన్ సీతాపతి, నేతలు రామ్మూర్తి, జయశంకర్ నరసింహులు, మనోహర్, వెంకటరమణ, కామరాజనాయక్, గజేంద్ర, అలీశీన, చంద్రశేఖర్‌రెడ్డి, గిరిదాసు, సేయి, కృష్ణప్ప తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెంచాలి



విద్యార్థులకు కిట్లు పంపిణీ చేస్తున్న ఎంపీడీవో మధుసూదన్‌రెడ్డి

రొంపిచెర్ల, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు మెరుగైన విద్యా బోధన అందించాలని.. ఉత్తీర్ణత శాతాన్ని పెంచాలని ఎంపీడీవో మధుసూదన్‌రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల, దద్దాలవారి పల్లె పాఠశాలల్లో విద్యార్థులకు ప్రభుత్వం మంజూరు చేసిన పుస్తకాలు, స్కూల్ బ్యాగులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఈవో శ్రీనివాసులు, టీడీపీ రాష్ట్ర మైనారిటీ సెల్ నాయకుడు అంజాద్‌ఖాన్, షేక్ కరీముల్లా, హెచ్‌ఎం చాందిని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బస్సుల కోసం విద్యార్థుల కష్టాలు



బస్సుల కోసం వేచి ఉన్న విద్యార్థులు

పుంగనూరు రూరల్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): పాఠశాలకు వెళ్లేందుకు బస్సుల సౌకర్యం లేక విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు. మండలంలోని పుంగనూరు నుంచి పాళ్యంపల్లె మీదుగా అడవినాథునికుంటకు విద్యార్థుల సౌకర్యార్థం ఆర్టీసీ బస్సును ఏర్పాటు చేశారు. రోజూ ఉదయం 8.30 గంటలకు అందుబాటులో ఉండగా మంగళవారం రాకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు బస్సును సమయానికి నడపాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఆర్టీసీ ఉద్యోగులకు ప్రోత్సాహకాలు



ఉద్యోగులకు ప్రోత్సాహక నగదు చెక్కులు అందజేస్తున్న డిపో మేనేజర్ సుధాకరయ్య

పుంగనూరు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీకి ఆదాయ వనరులను చేకూర్చడానికి సహకరిస్తున్న ఉద్యోగులకు ప్రోత్సాహక బహుమతులు అందజేస్తున్నట్లు ఆర్టీసీ డిపో మేనేజర్ సుధాకరయ్య తెలిపారు. మంగళవారం స్థానిక ఆర్టీసీ డిపో ఆవరణలో డీజల్ ఆదా చేసిన డ్రైవర్లు రామనాథం, సీవీ రమణ, ఎస్ఏ అలీ, ఆదాయాన్ని పెంచిన కండక్టర్లు అనసూయ, సురేష్‌లకు ప్రోత్సాహక బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఆర్టీసీ అధికారులు పావని, సుధాకర్ పాల్గొన్నారు.

మలేరియాపై ప్రజలను అప్రమత్తం చేయాలి



మాట్లాడుతున్న మలేరియా జిల్లా అధికారి వేణుగోపాల్

పుంగనూరు రూరల్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): మలేరియా, డెంగ్యూ జ్వరాలపై ప్రజలను అప్రమత్తం చేయాల్సిన అవసరముందని మలేరియా జిల్లా అధికారి వేణుగోపాల్ అన్నారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో వైద్య సిబ్బంది, కమిషనర్ మధుసూన్‌రెడ్డిలతో కలసి సమీక్షించారు. పట్టణంలో దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ట్యాంకులు, నీటి సంపులను శుభ్రం చేసేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో సబ్‌యూనిట్ అధికారి గంగయ్య, సూపర్‌వైజర్లు దేవప్రసాద్, ఆహానంద, తేజోమూర్తి, సోముశేఖర్ ఆచారి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి లక్ష్మీవేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు

సోమల, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నఉప్పరపల్లె పంచాయతీ కమ్మపల్లెలో కొలువుదీరిన లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో 18 నుంచి 23వ తేదీ సోమవారం వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. 18న అంకురార్పణ, 19న ధ్వజారోహణం, రాత్రి చిన్న శేషవాహనం ఊరేగింపు, 20న ఊంజల సేవ, 21న స్వామివార్ల కల్యాణోత్సవం, గరుడవాహన సేవలు, 22న అభిషేక పూజలు, అశ్వవాహన సేవ, 23న వసంతోత్సవం, చక్రస్నానం, ధ్వజావరోహణం, పుష్పయాగంతో ఉత్సవాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

నాణ్యతగా వసతి గృహాల్లో మరమ్మతు పనులు



పనులు పరిశీలిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ విజయకుమార్

చౌడేపల్లె, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): వసతి గృహాల్లో మరమ్మతు పనులు నాణ్యతగా చేయాలని మండల ప్రత్యేకాధికారి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ విజయకుమార్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన స్థానిక బాలికల, ఎస్సీ హాస్టల్లో మరమ్మతు పనులను పరిశీలించారు. విద్యార్థులకు వసతులు సౌకర్యవంతంగా కల్పించాలని, పనులు వేగవంతంగా చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ సోమశేఖర్ శ్రీనివాసులు, ఏఈఈలు సురేష్‌రెడ్డి, చందన, టీడీపీ నాయకులు పగడాల హరిప్రసాద్, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సుబ్రహ్మణ్యస్వామి షష్టి పూజలు



ప్రాకారోత్సవంలో ఊరేగుతున్న వళ్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి

రామకుప్పం, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం పట్టణ శివార్లలోని వళ్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో మంగళవారం షష్టి పూజలు వైభవంగా జరిగాయి. ఉదయం స్వామివారికి ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించి అలంకరణలు చేశారు. పలువురు భక్తులు స్వామి వారికి ప్రాకారోత్సవాలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం రాహుకాలంలో సర్పదోష నివారణ పూజలు నిర్వహించారు. 50 మందికి పైగా భక్తులు పూజల్లో పాల్గొన్నారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు అన్నప్రసాదాలను పంచిపెట్టారు.

జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా గంగాధర నాయుడు



పుంగనూరు రూరల్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు జూనియర్ ప్రభుత్వ బాలికల కళాశాల ప్రిన్సిపాల్‌గా గంగాధర నాయుడు మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడున్న ప్రిన్సిపాల్ కమలాకర్ బదిలీ కావడంతో సోమల జూనియర్ కళాశాలలో పని చేస్తున్న గంగాధర్‌నాయుడు బదిలీపై వచ్చారు.

మద్యంతాగి వాహనాలు నడిపితే చర్యలు

సోమల, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని సోమల ఎస్ఐ శివశంకర్ తెలిపారు. మంగళవారం సోమల శ్రీకృష్ణదేవరాయ సర్కిల్‌లో వాహన తనిఖీలు చేపట్టారు. ఈక్రమంలోనే రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కల్పించారు. హెల్మెట్లు విధిగా ధరించి వాహనాలు నడపాలని, మద్యం తాగి వాహనాలు నడపడంతో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగరాదని సూచించారు. గంజాయి, సారా అమ్మకాలపై పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

వేధింపులపై కేసు నమోదు

పుంగనూరు రూరల్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): వరకట్నం కోసం వేధిస్తున్నట్లు బాధితురాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ యూసఫ్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. పట్టణంలోని బాలాజీ థియేటర్ సమీపంలో ఉన్న బాషా కుమార్తె ఇష్రాత్ (27)కి బెంగళూరుకులోని హసీబ్‌అహ్మద్‌తో ఏడాది క్రితం వివాహం జరిగింది. ప్రస్తుతం రూ.40 లక్షలు వరకట్నం ఇస్తే సౌదీకి తీసుకెళతానని వేధిస్తున్నట్లు బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సమస్యలమయం..పుంగనూరు ఐటీఐ

● అధ్యాపకుల్లేక విద్యార్థులకు తప్పని తిప్పలు ● పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు





పుంగనూరు ప్రభుత్వ మైనారిటీ ఐటీఐలో వసతుల లేమితో ఉన్న భవనాలు

పుంగనూరు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు మైనారిటీ ఐటీఐ సమస్యలమయంగా మారింది. దీంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. 1998లో ప్రభుత్వం పుంగనూరులో ఐటీఐ స్థాపించినా స్థానిక పలమనేరు రోడ్డులోని గూడూరుపల్లె వద్ద 2010లో రూ.62.50 లక్షలతో సొంత భవనాలతో ఐటీఐ ప్రారంభించినప్పటి నుంచి నేటి వరకు పలు సమస్యలతో విద్యార్థులకు అవస్థలు తప్పడం లేదు. డీజల్ మెకానిక్, వెల్డర్, ఫ్యాషన్ డిజైన్ టెక్నాలజీ, ఎలక్ట్రిషన్, సివిల్, మోటారు మెకానికల్ (ఎంఎంవీ) కోర్సులు ప్రవేశపెట్టగా అందులో పదో తరగతి, ఇంటర్ విద్యార్హతతో యువతీ యువకులు అడ్మిషన్లు పొందుతున్నారు. గతంలో ప్రభుత్వం ఐటీఐకి 30 కంప్యూటర్లు అందజేసి కంప్యూటర్ ఆపరేటర్, ప్రోగ్రామింగ్ అసిస్టెంట్ కోర్సులు ఏర్పాటు చేసినా సంబంధిత ఫ్యాకల్టీలు లేకపోవడంతో కోర్సులకు విద్యార్థులు చేరలేదు. దీంతో అధికారులు రద్దు చేశారు. గతంలో టీడీపీ ప్రభుత్వం ఐటీఐలో నైపుణ్యాభివృద్ధికి స్కిల్ హబ్‌ను ప్రారంభించినా ఏడాది మాత్రమే నడిచి తర్వాత దాని ఊసేలేదు. ఐటీఐలో అన్ని విభాగాల్లో విలువైన పరికరాలు ఉన్నా అధ్యాపకులు లేక నిరుపయోగంగా ఉంటున్నాయి. డీజల్ మెకానిక్, ఫిట్టర్ విభాగాల్లో పనిచేసే అధ్యాపకులు మృతిచెందగా రెండేళ్లుగా పోస్టులు భర్తీకాకుండా ఖాళీగా ఉన్నాయి. పుంగనూరులో ట్రైనింగ్ ఆఫీసర్‌గా ఉన్న శ్రీనివాసులురెడ్డి పుంగనూరు, అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లె ఐటీఐలకు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా వ్యవహరిస్తున్నారు. డీజల్ మెకానిక్, వెల్డర్, ఫిట్టర్, మోటారు మెకానిక్ పోస్టులతోపాటు ఫ్యాషన్ డిజైన్ టెక్నాలజీలోని రెండు పోస్టులు, రెండు సీనియర్ అసిస్టెంట్, వాచ్‌మెన్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఐటీఐని పట్టణానికి మూడు కిలోమీటర్ల దూరంలో గుడిసెబండ పంచాయతీ పరిధిలోని గూడూరుపల్లె వద్ద నిర్మించారు. తొలి నుంచి నీటి సమస్యతో విద్యార్థులు, ఐటీఐ అధ్యాపకులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రైవేట్ ట్యాంకర్ల నుంచి కొనుగోలు చేసి నీటిని తెప్పించుకుంటున్నారు. స్థానిక గూడూరుపల్లెలోని పంచాయతీ పైపులైన్ నుంచి ఐటీఐకి తాగునీటి కొళాయి ఇచ్చి నీటి సమస్య తీర్చాలని కోరుతున్నారు. ఇక్కడ విలువైన పరికరాలుండగా వాచ్‌మెన్ లేకపోవడం, చుట్టూ ప్రహరీ లేక భద్రత కరవవుతోంది. ఈ విషయమై ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ శ్రీనివాసులురెడ్డి ఐటీఐ సమస్యలను ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. అధికారులు స్పందించి అన్ని కోర్సులకు ఫ్యాకల్టీలను నియమించి శిక్షణ ఇప్పించేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థులు కోరుతున్నారు.

పాఠశాలకు తాళం వేసి నిరసన



పాలమాకులపల్లి పాఠశాలకు తాళం వేసి నిరసన తెలుపుతున్న తల్లిదండ్రులు



మసనపల్లెలో నిరసన తెలుపుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు

పలమనేరు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): తమ గ్రామంలోని పాఠశాలను మరో పాఠశాలలో విలీనం చేయొద్దని పలమనేరు మండలం పాలమాకులపల్లి పాఠశాలకు తాళం వేసి మంగళవారం విద్యార్థులు, తల్లిదండ్రులు నిరసన వ్యక్తం చేశారు. పాలమాకులపల్లి ప్రాథమిక పాఠశాలలో సుమారు 30 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఈ పాఠశాలను పాలమాకులపల్లికి సుమారు 2కిలోమీటర్ల దూరంలోని దిగువకల్లాడు గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో విలీనం చేయాలని అధికారులు నిర్ణయించారు. దీంతో గ్రామస్థులు తమ పిల్లలను అక్కడకు పంపలేమని వాపోయారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.

● **పుంగనూరు రూరల్:** పిల్లలు పక్క గ్రామాలకు వెళ్లి చదువుకోవడం కష్టమని మంగళవారం బోడేవారిపల్లె పంచాయతీ మరసనపల్లె గ్రామంలో విద్యార్థుల తల్లిదండ్రులు నిరసన తెలిపారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామని వాపోయారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి



ఎస్‌టీవోకు వినతి పత్రం అందజేస్తున్న గురురాజారావు తదితరులు

పలమనేరు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): పలమనేరు సబ్‌ట్రెజరీ పరిధిలోని 1,350 మంది పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంగళవారం పెన్షనర్ల సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు గురురాజారావు తదితరులు ఎస్‌టీవో కిరణ్‌కు వినతిపత్రం అందించారు. 2024-25 సంవత్సరానికి సంబంధించిన ఫారం-16, 26-ఎ ఇవ్వాలని, పెన్షనర్ల పేస్లిప్‌లలో ఫ్యామిలీ పెన్షనర్ల పేరు, పుట్టినతేది లేని వారి వివరాలు నమోదు చేయాలని, చనిపోయిన పెన్షనర్లకు చెల్లించాల్సిన దహన సంస్కారాల సొమ్ము, గత ఆరు నెలలుగా చెల్లించలేదని, ఈహెచ్‌ఎస్ పథకంలో భార్యాభర్తలు ఇద్దరి వద్ద సభ్యత్వం రికవరీ చేస్తున్నారని.. అది ఒకరికే పరిమితం చేయాలని కోరారు. దీనిపై ఎస్‌టీవో స్పందిస్తూ వీలైనంత త్వరగా సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామని వారికి హామీ ఇచ్చారు. నాయకులు కృష్ణమూర్తి, గౌస్, మోహన్, అంజప్ప, వీరభద్రగౌడు, మాలతి, గురుస్వామినాయుడు, అక్బర్‌బాషా, మధు, జ్ఞానాల్వార్, వినాయకం, నాగభూషణం, కేశవులురెడ్డి, నిజాంసాహెబ్, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా



ధర్నాలో ఔట్‌సోర్సింగ్ ఇంజనీరింగ్, పారిశుధ్య ఉద్యోగులు



పుంగనూరులో... ఔట్‌సోర్సింగ్ ఇంజనీరింగ్ ఉద్యోగులు

పలమనేరు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : పలమనేరు మున్సిపల్ కార్యాలయం ఎదుట మంగళవారం మున్సిపాలిటీలో పనిచేసే అవుట్‌సోర్సింగ్ ఇంజనీరింగ్ విభాగం, పారిశుధ్య విభాగాల్లో పనిచేసే ఉద్యోగులు ధర్నా చేపట్టారు. టెక్నికల్ ఉద్యోగులకు నెలకు రూ. 29, 200, నాన్ టెక్నికల్ ఉద్యోగులకు నెలకు రూ.24,500 జీతంగా ఇవ్వాలని, ఇప్పుడిస్తున్న జీతానికి రూ.6 వేలు పెంచి పారిశుధ్య కార్మికులు, డ్రైవర్లకు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో నాయకులు పి.మహేష్‌బాబు, ఎం.శ్రీనివాసలు, రాజేష్ బాబు, జైపాల్ తదితరులు పాల్గొన్నారు.

● **పుంగనూరు:** పుంగనూరులోని మున్సిపల్ కార్యాలయం ఎదుట మంగళవారం ఇంజనీరంగ్ విభాగం సిబ్బంది, పారిశుధ్య కార్మికులు ధర్నా చేపట్టారు. కార్యక్రమంలో కార్మికులు వసంతకుమార్, జయకుమార్, మోహన్, నంజచారి, సుబ్రహ్మణ్యం, శంకరయ్య, నాగరాజ, సంతోష్‌కుమార్, జగన్నాధరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కూటమి నేతల పరామర్శ



బాధిత మహిళను పరామర్శిస్తున్న ఎన్డీయే నేతలు



హోం మంత్రి అనితతో మాట్లాడిస్తున్న టీడీపీ నాయకులు రాజ్‌కుమార్, ప్రేమ్‌కుమార్

కుప్పం, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): నారాయణపురం ఘటనలో బాధితురాలు శిరీషను ఎన్డీయే నేతలు మంగళవారం పరామర్శించారు. జనసేన పార్టీ కుప్పం ఇన్‌చార్జి నరేష్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తులసీనాథ్, దళిత నేత దేవరాజ్‌లు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితురాలిని కలిసి ఘటన గురించి అడిగి తెలుసుకున్నారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి మండపల్లి రాంప్రసాద్‌చే ఫోన్లో మాట్లాడించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం బాధితురాలికి అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. అనంతరం ఎన్డీయే నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి అండగా ఉంటారని చెప్పారు. రెండు పార్టీలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

రొంపిచెర్ల తహసీల్దారుగా అమరనాథ్



రొంపిచెర్ల, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): రొంపిచెర్ల తహసీల్దారుగా చిత్తూరు జిల్లా కార్యాలయంలో పనిచేస్తున్న అమరనాథ్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. రెవెన్యూ, ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని తెలిపారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

సదుం, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ షేక్ షావలి సూచించారు. తల్లికి వందనం పథకం లబ్ధిదారులే లక్ష్యంగా సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడుతున్నారన్నారు. డబ్బులు పడని వారికి ఫోన్లు చేస్తూ ఓటీపీ నెంబర్లు అడుగుతుంటారని, ఎట్టి పరిస్థితుల్లోనూ ఆ ఫోన్ కాల్స్‌కి స్పందించకండనిహెచ్చరించారు. తల్లికి వందనం లబ్ధిపై అనుమానాలుంటే ఆయా గ్రామ సచివాలయాలకు వెళ్లి సంప్రదించాలని సూచించారు. ప్రజలు అప్రమత్తంగా ఉంటూ మోసపోకూడదని సూచించారు.

అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి

పలమనేరు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): పలమనేరు మున్సిపాలిటీ గంటావూరు కాలనీలో నివాసం ఉంటున్న పశుపతి భార్య ప్రియ మంగళవారం అనుమానాస్పద స్థితిలో మృతిచెందింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పలమనేరు పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలి

రొంపిచెర్ల, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెంచమరెడ్డిగారిపల్లెలో వారం రోజులుగా తాగునీటితో ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు రఘునాథ్, చెంగల్‌రెడ్డి వాపోయారు. తాగునీటి కోసం ఏర్పాటు చేసిన బోరు మోటారుకు అమర్చిన సుమారు 35 మీటర్ల విద్యుత్తు తీగలు గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేసుకెళ్లారు. దీంతో గ్రామానికి నీటి సరఫరా జరగలేదని వాపోయారు.

మహిళపై దాడి

పుంగనూరు రూరల్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మంగళం పంచాయతీ కంగానెల్లూరుకు చెందిన మణికంఠకు అదే గ్రామానికి చెందిన హరి, వంశీలకు భూతగాదాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో మణికంఠ భార్య రతీదేవి(35) ఇంటి ముందు ఉండగా హరి, వంశీలు మంగళవారం దాడి చేసి గాయపరిచారు. కుటుంబ సభ్యులు గాయపడిన రతీదేవిని పుంగనూరు ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్సలు అందించారు. బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది.

వ్యక్తి అదృశ్యం

పుంగనూరు రూరల్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ రుక్మంగధ నాయుడు తెలిపారు. పట్టణంలోని దోబీకాలనీకి చెందిన రెడ్డెప్పరెడ్డి కుమారుడు జగదీశ్ (22) పట్టణంలోని ఓ మెకానిక్ దుకాణంలో పని చేస్తున్నాడు. ఉదయం పనికి వెళుతున్నట్లు చెప్పి సాయంత్రం ఇంటికి రాకపోవడంతో తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రమాదంలో ఒకరి దుర్మరణం

చిత్తూరు అర్బన్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. ఈ దుర్ఘటన మంగళవారం రాత్రి చిత్తూరు నగర శివార్లలో జరిగింది. చిత్తూరు రూరల్ మండలం దిగువమాసాపల్లెకి చెందిన పట్టాభి (51) ఇరువారంలోని బంధువుల ఇంటికి బయల్దేరాడు. ఇరువారం జంక్షన్ సమీపంలో నడిచి రోడ్డు దాటుతుండగా చెన్నై నుంచి బెంగళూరు వైపు వెళ్తున్న కారు వేగంగా వచ్చి ఢీకొంది. ఈ ప్రమాదంలో పట్టాభి అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

వైఎస్ జగన్ అంటేనే
నయవంచకుడు: తెలుగు యువత

వెదురుకుప్పం, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): వైఎస్ జగన్ అంటేనే నయవంచకుడు, అరాచకం, విధ్వంసానికి సింబాలిక్ అని తెలుగు యువత జీడీనెల్లూరు నియోజకవర్గ అధ్యక్షుడు గురుసాల కిషన్‌చంద్ దుయ్యబట్టారు. మంగళవారం వెదురుకుప్పంలో మీడియాతో మాట్లాడుతూ.. 'జగన్ అంటే నమ్మకం-చంద్రబాబు అంటే మోసం' పేరిట కార్యక్రమాన్ని వైసీపీ శ్రేణులు చేపట్టడాన్ని తప్పుబట్టారు. జగన్ ప్రభుత్వంలోని మోసం, కుట్రలు, దగా, నయవంచన ఇతరత్రా వాటిపై వైసీపీ శ్రేణులు ఆత్మపరిశీలన చేసుకోవాలన్నారు. పినతండ్రి వైఎస్ వివేకానందరెడ్డి తన ఎంపీ సీటును రాజకీయ భిక్షగా పెడితే.. ఆయనకు రిటర్న్ గిఫ్ట్‌గా గొడ్డలిపోటు ఇచ్చి రుణం తీర్చుకున్నందుకు నమ్మాలా? అన్నారు. సీపీఎస్ రద్దుతోపాటు మద్యపాన నిషేధం అమలు చేస్తానని, అమరావతిని బాగు చేయకుండా, పోలవరం పూర్తి చేయకుండా మోసం చేసిన జగన్‌ను నమ్మాలా అని ఆయన ప్రశ్నించారు.

చంద్రబాబు పాలనతోనే రాష్ట్రాభివృద్ధి: సీఎం చంద్రబాబు పాలనతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతున్నట్లు కిషన్‌చంద్ అన్నారు. అమ్మఒడి పథకంలో జగన్ మోసం చేస్తే చంద్రబాబు మాత్రం.. తల్లికి వందనం పేరుతో ఒకే తల్లికి ఎంతమంది పిల్లలున్నా అందరికీ పథకం వర్తింపజేశారని కొనియాడారు. ఈ ప్రభుత్వంలో అమరావతి నిర్మాణానికి రూ.4వేల కోట్లు, పోలవరానికి రూ.12వేల కోట్లు తెచ్చారని, విశాఖ ఉక్కు.. ప్రైవేటీకరణ జరగకుండా ఆపారన్నారు. ఇప్పటికైనా వైసీపీ శ్రేణులు కూడా అభివృద్ధికి సహకరించాలే తప్ప చౌక బారు పనులుచేసి ప్రజల వద్ద మరింత పలుచన కావొద్దని హితవు పలికారు.

మద్యం మత్తులో వాహనం నడిపితే అకాల మరణమే..!

● ట్రాఫిక్ సీఐ నిత్యబాబు

చిత్తూరు అర్బన్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో వాహనం నడిపితే అకాల మరణం తప్పదని ట్రాఫిక్ సీఐ నిత్యబాబు హెచ్చరించారు. కొన్ని రోజులుగా ట్రాఫిక్ పోలీసులు నగరంలోని వివిధ ప్రాంతాల్లో నిర్వహించిన తనిఖీల్లో 16 మంది మద్యం తాగి వాహనాలు నడిపినవారిపై కేసు నమోదుచేసి జడ్జి ముందు ప్రవేశపెట్టారు. జడ్జి ఉమాదేవి.. ఒక్కొక్కరికి రూ.10వేల చొప్పున రూ.1.60 లక్షల జరిమానా విధించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సీఐ మాట్లాడుతూ.. రోడ్డు నియమ నిబంధనలను పాటించడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. అతివేగంగా, మద్యం తాగి వాహనాలు నడపడం వల్ల మీతోపాటు ఇతరుల ప్రాణాలనూ ప్రమాదంలో పడేసినట్లేనన్నారు. ● ఒకటో పట్టణ పరిధిలోనూ ఏడుగురు మద్యం తాగి వాహనాలు నడపగా, ఒక్కొక్కరికి రూ.10వేల చొప్పున, బహిరంగ ప్రదేశంలో మద్యం తాగిన 11 మందికి ఒక్కొక్కరికి రూ.వెయ్యి చొప్పున జరిమానాను న్యాయమూర్తి విధించినట్లు సీఐ మహేశ్వర తెలిపారు.

పశువుల దాణా పంపిణీ


పాడి రైతులకు పశువుల దాణా పంపిణీ చేస్తున్న సుబ్రహ్మణ్యం నాయుడు

గుడిపాల, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో పాడి రైతులకు రాం ౩౩ తీ న్లి ప్రభుత్వం అందజేసే పశువుల దాణాను మంగళవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు సుబ్రహ్మణ్యంనాయుడు, నాయకులు గోళ్ల హేమాద్రినాయుడు, రవినాయుడు, చల్లా మహదేవన్, పశువైద్యాధికారి సాయిసుధ, శేఖర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ ఇంజనీరింగ్ ఉద్యోగుల నిరసన



నగరి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ కార్యాలయం వద్ద ఇంజనీరింగ్ విభాగ ఉద్యోగులు మంగళవారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో నిరసన తెలిపారు. తమ డిమాండ్ల పరిష్కారం కోసం రాష్ట్ర ఇంజనీరింగ్ శాఖ నాయకుల పిలుపుతో ఈ నిరసన చేపట్టామన్నారు.

కుప్పంలో మహిళపై దాడిని ఖండిస్తున్నాం: సీపీఐ

చిత్తూరు రూరల్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నియోజకవర్గంలో మహిళపై జరిగిన దాడిని ఖండిస్తున్నమని సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజు తెలిపారు. అప్పు తిరిగి చెల్లించలేదని శిరీష అనే మహిళను తన బిడ్డ ముందు దాడి చేయడం దారుణమన్నారు. దీనికి కారకులను వెంటనే కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. సీపీఐ తరపున ఖండిస్తున్నామన్నారు.

ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో భక్తాంజనేయస్వామి - సుబ్రహ్మణ్యస్వామి - బంగారమ్మ

వెదురుకుప్పం, జూన్ 17(ఆంధ్రజ్యోతి): దేవళంపేట గ్రామంలోని భక్తాంజనేయస్వామికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. కార్యనిర్వాహకులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ● కార్వేటినగరంలో వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యంస్వామికి మంగళవారం ప్రత్యేక పూజలు,అభిషేకాలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. ● కార్వేటినగరంలోని గ్రామదేవత బంగారమ్మకు మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఏర్పాట్లను ఆలయ ధర్మకర్త కొప్పేటి ప్రసాద్ పర్యవేక్షించారు.

నేడు విద్యుత్ శాఖలో ప్రత్యేక గ్రీవెన్స్ డే

చిత్తూరు రూరల్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): గాంధీరోడ్డులోని చిత్తూరు ఆపరేషన్ డివిజన్ విద్యుత్ శాఖ కార్యాలయంలో బుధవారం ప్రత్యేక గ్రీవెన్స్ డే నిర్వహిస్తున్నట్లు ఈఈ మునిచంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు, రైతులు తమ సమస్యలను తెలియజేయవచ్చన్నారు.

పీహెచ్‌సీలో రికార్డుల తనిఖీ


రికార్డులు పరిశీలిస్తున్న హనుమంతరావు

వెదురుకుప్పం, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): పచ్చికాపల్లం పీహెచ్‌సీని మంగళవారం జిల్లా టీకా అధికారి డాక్టర్ హనుమంతరావు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. హెల్త్ అసిస్టెంట్ పట్టుబాల కృష్ణారెడ్డి, ల్యాబ్ టెక్నీషియన్ డేవిడ్, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఏకోపాధ్యాయుడికి ఘన స్వాగతం



వెదురుకుప్పం, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం మండలం శెట్టిగుంట వైసీ కాలనీ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు బదిలీపై ఏకోపాధ్యాయుడిగా వచ్చిన రాజ్‌కుమార్‌కు విద్యార్థులు, తల్లిదండ్రులు ఘన స్వాగతం పలికారు. ఈయన సత్యవేడు నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఈ కార్యక్రమంలో పూర్వ ఉపాధ్యాయుడు యువరాజు కూడా పాల్గొన్నారు.

నిరుపయోగంగా నగరి ఆర్టీసీ బస్టాండు

ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు



నగరి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): నగరిలో 1985లో ప్రయాణికులకు అనువుగా ఉంటుందని పట్టణానికి కూతవేటు దూరంలో అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీఆర్ హయాంలోఆర్టీసీ బస్టాండును ఏర్పాటు చేశారు. దీన్ని కేవలం ఏడాది పాటు ఉపయోగించి, వదిలేశారు. ఆ తర్వాత నుంచి పట్టణంలోని సంత మైదానాన్ని బస్టాండుగా వాడుకుంటుండటంతో ప్రయాణికులకు తిప్పలు తప్పడం లేదు. ఎందుకంటే శుక్రవారం వస్తే ఇక్కడ సంత కూడా ఏర్పాటు చేయడంతో రోడ్డుపైనే బస్సులను ఆపాల్సి వస్తోంది. దీనివల్ల ట్రాఫిక్ కష్టాలు ఎక్కువవుతున్నాయి. బస్సులు నిలిపే ఆవరణలో చెట్లు, పొదలతో ఉండటంతో చీకటి పడితే మద్యపాన ప్రియులు సందడి ఎక్కువగా ఉంటోంది. వీరివల్లా ఇబ్బందులు తప్పడం లేదు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి గతంలో నిర్మించిన బస్టాండును ఉపయోగంలోకి తేవాలని స్థానికులు కోరుతున్నారు.

అవాంఛనీయ సంఘటనలు జరగకూడదు

జైన్ ఫ్యాక్టరీ యాజమాన్యానికి ఎస్పీ మణికంఠ సూచన

గంగాధరనెల్లూరు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసుకోవాలని 100 గొల్లపల్లెలోని జైన్ ఫ్యాక్టరీ యాజమాన్యానికి ఎస్పీ మణికంఠ సూచించారు. ఫ్యాక్టరీని మంగళవారం ఆయన పరిశీలించారు. ఫ్యాక్టరీలో పల్ప్ నిల్వ సామర్థ్యం, రీప్యాకింగ్, కాంపౌండ్‌వాల్, సీసీ కెమెరాల పర్యవేక్షణ, తదితరాలను జనరల్ మేనేజర్ దిలీప్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఏడాదీ జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి రైతులు ఎక్కువ మొత్తంలో తోతాపురి మామిడికాయలను ఈ ఫ్యాక్టరీకి తీసుకొస్తుంటారన్నారు. ఆ సమయంలో రైతులకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భద్రత చర్యలు పటిష్ఠంగా తీసుకోవాలని చెప్పారు. అంతకుముందు డీఆర్‌డీఏ పీడీ శ్రీదేవి కూడా ఫ్యాక్టరీ వద్దకొచ్చారు. ఎన్ని ట్రాక్టర్ల మామిడి లోడ్లు వెయిటింగ్‌లో ఉన్నాయి, ఎన్ని అన్‌లోడింగ్ అయ్యాయన్న విషయాలపై ఫ్యాక్టరీకి చెందిన అధికారులు, అక్కడున్న రెవెన్యూ, పంచాయతీ, వ్యవసాయ శాఖ అధికారుల నుంచి తెలుసుకున్నారు. ఇన్‌చార్జి తహసీల్దార్ తులసీరామ్, ఇన్‌చార్జి సీఐ శ్రీనివాసంతి, వెలుగు ఏపీఎం ఫరీద్‌మస్తాన్, ఏఈవో కుసుమ, వీఆర్వో సురేష్‌బాబు పాల్గొన్నారు.


జైన్ ఫ్యాక్టరీలో మామిడి పల్ప్‌ని పరిశీలిస్తున్న ఎస్పీ మణికంఠ - వ్యవసాయశాఖ సిబ్బందితో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ శ్రీదేవి

మోడల్ ప్రైమరీ పాఠశాలలకు పిల్లలను పంపించం

ఎల్ఎన్ కండ్రిగ, అగ్రహారం దళితవాడ ప్రాథమిక పాఠశాలల వద్ద తల్లిదండ్రుల ధర్నా

గంగాధరనెల్లూరు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): మోడల్ ప్రైమరీ పాఠశాలలకు తమ పిల్లలను పంపించేది లేదని విద్యార్థుల తల్లిదండ్రులు చెప్పారు. ఈ మేరకు అంబోధరపల్లె పంచాయతీ ఎల్ఎన్ కండ్రిగ, పాతవెంకటాపురం పంచాయతీకి చెందిన అగ్రహారం దళితవాడలోని ప్రాథమిక పాఠశాలల వద్ద విద్యార్థులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఎల్ఎన్ కండ్రిగ పాఠశాలలోని 3,4,5 తరగతులకు చెందిన విద్యార్థులను మహదేవమంగళంలోని మోడల్ ప్రైమరీ పాఠశాలకు, అగ్రహారం దళితవాడలోని విద్యార్థులను కొత్తవెంకటాపురంలోని మోడల్ ప్రైమరీ పాఠశాలలో కలిపేయడం సరికాదన్నారు. తమ గ్రామాల్లోనే విద్యార్థులు చదువుకునేలా ఏర్పాట్లు చేయాలని కోరారు. ఈ విషయాన్ని జిల్లా ఉన్నతాధికారులకు తెలియజేస్తామని ఎంఈవో-2 గుణశేఖర్‌రెడ్డి తెలిపారు.


ఎల్ఎన్ కండ్రిగ, అగ్రహారం దళితవాడ పాఠశాలల వద్ద విద్యార్థులతో కలిసి నినాదాలు చేస్తున్న తల్లిదండ్రులు

రోడ్డు ప్రమాదంలో ఒకరి దుర్మరణం

చిత్తూరు అర్బన్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. ఈ దుర్ఘటన మంగళవారం రాత్రి చిత్తూరు నగర శివార్లలో జరిగింది. చిత్తూరు రూరల్ మండలం దిగువసాపల్లెకి చెందిన పట్టాభి (51) ఇరువారంలోని బంధువుల ఇంటికి బయల్దేరాడు. ఇరువారం జంక్షన్ సమీపంలో నడిచి రోడ్డు దాటుతుండగా చెన్నై నుంచి బెంగళూరు వైపు వెళ్తున్న కారు వేగంగా వచ్చి ఢీకొంది. ఈ ప్రమాదంలో పట్టాభి అక్కడికక్కడే మృతి చెందాడు. ట్రాఫిక్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

మహిళలకు రక్షణ లేకుండా పోయింది

● మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి

వెదురుకుప్పం, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి ఆరోపించారు. ఈమేరకు మంగళవారం మీడియాకు వీడియోలు విడుదల చేశారు. ముఖ్యమంత్రి సొంత నియోజకవర్గంలోని కుప్పంలో రుణం చెల్లించలేదని ఓ మహిళ పట్ల అమానుషంగా ప్రవర్తించడం దుర్మార్గపు చర్యగా పేర్కొన్నారు. ఇంతద జరుగుతున్నా సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, హోంమంత్రి అనిత, మంత్రి లోకేశ్‌లు ఏం సందేశం ఇస్తున్నారని ప్రశ్నించారు.

రోడ్డుపై మురుగు



ఐరాల, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ఐరాలలోని న్యూ కాలనీలో కాలువలేక పోవడంతో మురుగు రోడ్డుపై పారుతోంది. దీనివల్ల కాలనీలో దుర్గంధం వెదజల్లుతోంది. పాదచారులు, ద్విచక్ర వాహనదారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. వర్షాలు ముమ్మరంగా కురిస్తే ఎక్కడ అంటురోగాలు వస్తాయోనని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా కాలువలు నిర్మించాలని కోరుతున్నారు.

వరకట్న వేధింపులపై కేసు నమోదు

పుంగనూరు రూరల్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): వరకట్న వేధింపులపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ యూసఫ్ తెలిపారు. పుంగనూరు పట్టణంలోని బాలాజీ థియేటర్ సమీపంలో ఉన్న బాషా కుమార్తె ఇష్రాత్ (27)కి బెంగళూరుకులోని హసీబ్‌అహ్మద్‌తో ఏడాది క్రితం వివాహం జరిగింది. ప్రస్తుతం రూ.40లక్షలు వరకట్నం ఇస్తే సౌదీకి తీసుకెళతానని వేధిస్తున్నట్లు బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

స్వీట్స్ దుకాణంలో స్వల్ప అగ్నిప్రమాదం


మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

చిత్తూరు సిటీ, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాస్పత్రికి సమీపంలోని స్వీట్స్ దుకాణంలో మంగళవారం సాయంత్రం స్వల్ప అగ్నిప్రమాదం సంభవించింది. దుకాణంలో బజ్జీలు వేస్తున్న సమయంలో గ్యాస్ పైపు లీక్ కావడంతో అగ్ని ప్రమాదం జరిగినట్లు స్థానికులు తెలిపారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపుచేశారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.10వేల నష్టం వాటిల్లి ఉంటుందని అగ్నిమాపక శాఖ అధికారులు తెలిపారు.

మహిళపై దాడి

పుంగనూరు రూరల్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు మండలంలోని మంగళం పంచాయతీ కంగానెల్లూరుకు చెందిన మణికంఠకు అదే గ్రామానికి చెందిన హరి, వంశీలకు భూతగాదాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో మణికంఠ భార్య రతీదేవి(35) ఇంటి ముందు ఉండగా హరి, వంశీలు మంగళవారం దాడి చేసి గాయపరిచారు. కుటుంబ సభ్యులు గాయపడిన రతీదేవిని పుంగనూరు ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్సలు అందించారు. బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది.

అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి

పలమనేరు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): పలమనేరు మున్సిపాలిటీ గంటావూరు కాలనీలో నివాసం ఉంటున్న పశుపతి భార్య ప్రియ మంగళవారం అనుమానాస్పద స్థితిలో మృతిచెందింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదుచేసి మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

వ్యక్తి అదృశ్యం

క్రైం కార్నర్

పుంగనూరు రూరల్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ రుక్మంగధ నాయుడు తెలిపారు. పుంగనూరు పట్టణంలోని దోభీకాలనీకి చెందిన రెడ్డెప్పరెడ్డి కుమారుడు జగదీశ్ (22) పట్టణంలోని ఓ మెకానిక్ దుకాణంలో పని చేస్తున్నాడు. ఉదయం పనికి వెళుతున్నట్లు చెప్పి సాయంత్రం ఇంటికి రాకపోవడంతో తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

సదుం, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ షేక్ షావలి సూచించారు. తల్లికి వందనం పథకం లబ్ధిదారులే లక్ష్యంగా సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడుతున్నారన్నారు. డబ్బులు పడని వారికి ఫోన్లు చేస్తూ ఓటీపీ నెంబర్లు అడుగుతుంటారని, ఎట్టి పరిస్థితుల్లోనూ ఆ ఫోన్ కాల్స్‌కి స్పందించకండనిహెచ్చరించారు. తల్లికి వందనం లబ్ధిపై అనుమానాలుంటే ఆయా గ్రామ సచివాలయాలకు వెళ్లి సంప్రదించాలని సూచించారు. ప్రజలు అప్రమత్తంగా ఉంటూ మోసపోకూడదని సూచించారు.

జీడీనెల్లూరులో నేడు థామస్ పర్యటన

గంగాధరనెల్లూరు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): గంగాధరనెల్లూరుమండలంలో బుధవారంపలు కార్యక్రమాల్లో ప్రభుత్వ విప్ థామస్ పాల్గొననున్నట్లు పీఏ చంద్రశేఖర్, టీడీపీ మండల అధ్యక్షుడు స్వామిదాస్ తెలిపారు. ఎంపీడీవో కార్యాలయం వద్ద ఉదయం 10.30 గంటలకు రైతులకు వ్యవసాయ పనిముట్లు పంపిణీ చేస్తారు. 11.30గంటలకు తల్లికి వందనంపథకంపై మీడియాతో మాట్లాడతారు. మధ్యాహ్నం 12.30గంటలకు ముక్కళత్తూరు దళితవాడకు సమీపంనుంచి ముస్తిపల్లె వరకు తారురోడ్డు నిర్మాణానికి జరిగే భూమిపూజలో పాల్గొంటారని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఉచిత కుట్టు శిక్షణ / ఆనందం వ్యక్తం చేస్తున్న మహిళలు

పెనుమూరు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): మహిళలకు ఆర్థిక చేయూత ఇవ్వడానికి ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా ఉచిత కుట్టు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. పెనుమూరులోని డ్వాక్రా మహిళా కార్యాలయంలో నిర్వహిస్తున్న ఈ శిక్షణ తరగతులకు వివిధ ప్రాంతాలకు చెందిన 122 మంది మహిళలు హాజరై శిక్షణ తీసుకుంటున్నారు. శిక్షణ అనంతరం వీరికి ప్రభుత్వం తరఫున కుట్టు మిషన్లు ఉచితంగా అందజేయనున్నట్లు శిక్షకురాలు చెబుతున్నారు. ఈ సందర్భంగా శిక్షణ పొందుతున్న నిర్మల (గొడుగుమానుపల్లె), ప్రసన్న, (గుడ్యానంపల్లె), శోభ (బొంతివంక), రాధిక (బండకిండపల్లె) మాట్లాడుతూ.. ఈ శిక్షణ తమకు స్వశక్తితో ఎదుగుదలకు దోహద పడుతుందని చెప్పారు. కుటుంబ అవసరాలకు సంపాదించగలుతామని ఆనందం వ్యక్తం చేశారు.

శిక్షణకు హాజరైన మహిళలు →



సంక్షిప్తంగా..

వైభవంగా ద్రౌపదీ కల్యాణోత్సవం



గంగాధరనెల్లూరు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): బాలగంగనపల్లె గ్రామంలో ద్రౌపదీ కల్యాణోత్సవాన్ని మంగళవారం వైభవంగా నిర్వహించారు. మహాభారత యజ్ఞంలో భాగంగా హరికథా కాలక్షేపం చేశారు. అనంతరం గ్రామానికి చెందిన భూషణ, వరద ఆచ్చారి దంపతులు ఉభయదారులుగా వ్యవహరించగా కల్యాణోత్సవాన్ని అర్చకులు విజయభాస్కర్ శర్మ, నరసింహశర్మలు నేత్రానందంగా నిర్వహించారు. హాజరైన భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

అంగన్వాడీలు సమయపాలన పాటించాలి: సీడీపీవో


అంగన్వాడీ సిబ్బందికి పుస్తకాలను పంపిణీ చేస్తున్న సీడీపీవో శోభారాణి

వెదురుకుప్పం, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): అంగన్వాడీ కేంద్రాల్లో పనిచేస్తున్న వర్కర్లు, సహాయకులు సమయపాలన పాటించాలని సీడీపీవో పీజేడీ శోభారాణి ఆదేశించారు. మంగళవారం కార్వేటినగరం ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో అంగన్వాడీల సహాయకులతో సమావేశమయ్యారు. ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం 201 అంగన్వాడీ కేంద్రాలకు పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. సూపర్‌వైజర్ శకుంతల, డీఈవో ఉమ, ఉద్యోగులు హాజరయ్యారు.

నలగాంపల్లెలో గంగజాతర



బంగారుపాళ్యం, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): నలగాంపల్లె పంచాయతీ పిడివి కండ్రిగలో మంగళవారం గంగజాతరను ఘనంగా నిర్వహించారు. మహిళలు అమ్మవారికి అంబళ్లు పోసి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం పొంగళ్లు నైవేద్యం సమర్పించారు. ఈ సందర్భంగా టీడీపీ మండల అధ్యక్షుడు ఎన్పీ ధరణీ, మాజీ అధ్యక్షుడు ఎన్పీ జయప్రకాష్ పూజల్లో పాల్గొన్నారు. ఎన్పీ జయచంద్రనాయుడు, సన్‌గోల్డ్ జ్యూస్ ఫ్యాక్టరీ మేనేజర్ ధనంజయనాయుడు, జనార్థన్‌గౌడ్, రాధాకృష్ణమనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

మామిడి రైతులకు గిట్టుబాటు ధర ఇవ్వాలి: వైసీపీ

వెదురుకుప్పం, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మామిడి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని వైసీపీ జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు బట్టే సుబ్రహ్మణ్యం డిమాండ్ చేశారు. మంగళవారం వెదురుకుప్పంలో వైసీపీ శ్రేణులతో కలిసి నిరసన తెలిపారు. జగన్ అంటే నమ్మకం-చంద్రబాబు అంటే మోసం అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. ప్రభుత్వంపై విమర్శలు చేశారు. జిల్లా పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి రామయ్య, నాయకులు నారాయణరెడ్డి, వెంకటేశులు, జగదీష్ రెడ్డి, పద్మనాభరెడ్డి తదితరులు పాల్గొన్నారు.